# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 30-7-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:285 పేజీలు:6 వెల: రూ.1/-


## సభకు రానప్పుడు కెసిఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు?

### - ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నామని, కెసిఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే కెసిఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదనడం సరికాదన్నారు. సభకు రానప్పుడు కెసిఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదా కెసిఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చుకదా? అని రాజగోపాల్ రెడ్డి చురకలంటించారు.తెలంగాణ విభజన సమయంలో అధిక విద్యుత్‌ను మన రాష్ట్రానికి యుపిఎ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.. జనాభా ప్రాతిపదికన కాకుండా అవసరాల మేరకు విద్యుత్‌ను కేటాయించాలన్నారు. విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నామని,

### చురక

అద్భుతంగా మురిపంచె
అభివృద్ధి వికాసం
అందుతుంది ఎందరికి
అందమైన ఆకాశం.

అధినేతల మేజిక్ లు
అందరినీ కట్టేస్తయి
నిజంగాక జనం బతుకు
నిత్యమవి కుట్టేస్తయి



9440433475

# కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్‌లో మొక్కలు నాటిన రేవంత్..



హైదరాబాద్, జులై 29: నగరంలోని కుతుబ్‌షాహీ హెరిటేజ్ పార్క్‌లో అగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పరిశీలించారు.

సీఎం అక్కడ మొక్క నాటి హరిత స్ఫూర్తిని చాటారు. 2013లో కుతుబ్‌షాహీ వారసత్వ సంపద పరిరక్షణ ప్రాజెక్టును అగాఖాన్ ఫౌండేషన్ చేపట్టింది. రాష్ట్ర సాంస్కృతిక శాఖతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

తెలంగాణ సాధన కోసం నిరంతరం తపించి, రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన రాజకీయ దురంధరుడు స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మహానాయకుడికి ఘన నివాళులు అర్పించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో జైపాల్ రెడ్డి గారి స్మారక చిహ్నమైన 'స్ఫూర్తి స్థలం' వద్ద పుష్పాంజలి ఘటించారు. పాలమూరు పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎదిగిన తెలుగు రాజకీయవేత్తగా, విలువల వైతాళికుడిగా జైపాల్ రెడ్డి గారు కలకాలం గుర్తుండిపోతారని సీఎం కొనియాడారు

ఈ .కార్యక్రమంలో ముఖ్యమంత్రి తోపాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ,, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి ,, పలువురు ప్రజాప్రతినిధులు, జైపాల్ రెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు.

# నేడు రైతు రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల

## -రేవంత్ రెడ్డి

### -రూ.లక్షన్నర లోపు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి నిధులు?
### -అసెంబ్లీ ఆవరణలో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి?
### -రేపు సభలో రుణమాఫీపై చర్చ పెట్టే ఆలోచనలో సర్కార్..

హైదరాబాద్, జులై 29: రెండో విడత రైతు రుణమాఫీపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేస్తామన్న హామీని నెరవేర్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పుడు రెండో విడత రైతు రుణమాఫీకు సిద్ధమైంది. ఈ నెలాఖరులో రెండో విడత, వచ్చే నెల మొదటి వారంలో మూడో విడత నిధులు విడుదల చేస్తామన్న ప్రకారమే రేపు నిధులు విడుదల చేయనున్నట్లు ముఖ్యమంత్ర రేవంత్ రెడ్డి నేడు అసెంబ్లీలో ప్రకటించారు.

రైతుల ఖాతాల్లోకి నిధులు జమ చేసే విషయమై ఆర్థిక శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.. లక్షన్నర లోపు రుణం ఉన్న రైతుల ఖాతాలోకి రేపు నిధులు జమ కానున్నాయి.. ఇక రెండో విడుత రుణ మాఫీ నిధులను అసెంబ్లీ ఆవరణలో సీఎం రేవంత్ విడుదల చేయనున్నారు..

రేపు సభలో రుణమాఫీ పై తెలంగాణ సర్కార్ చర్చ పెట్టే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. రేపు కూడా సభలో 19 శాఖల పద్దులపై చర్చ నేపథ్యంలో ప్రకటన ఐనా చేయాలని సర్కార్ భావిస్తుంది.

### తొలి విడతలో సాంకేతిక సమస్యలు..

కాగా.. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు మాఫీ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా కొంత మంది రైతుల ఖాతాల్లో నగదు పూర్తిగా జమ కావడం లేదని ఫిర్యాదులు అందుతుండటంతో దీనిపై మంత్రి తుమ్మల స్పందించారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా కొంత మంది రైతుల ఖాతాల్లో నగదు పూర్తిగా జమ కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని దీనిపై మంత్రి తుమ్మల వివరణ ఇచ్చారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణాలు ఉన్న రైతులకు మాఫీ అవుతుందని భావించగా కొంత మంది రైతుల ఖాతాల్లో సాంకేతిక సమస్యల వల్ల అది సాధ్యం కాలేదు. రుణమాఫీ సొమ్మును రిజర్వ్ బ్యాంకు ఈ-కుబేర్ విధానంలో జమ చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతలో 17 వేల 877 మంది లబ్ధిదారుల ఖాతాల్లో 84.94 కోట్ల రూపాయలు జమ కాలేదన్నారు. ఆ నిధులు ఆర్‌బీఐ వద్దే ఉన్నాయని తెలిపారు.

# విద్యుత్.. కొనుగోళ్లలో వేల కోట్ల అవినీతి.. ఎవరినీ వదిలేది లేదన్న రేవంత్

### -జ్యూడీషియల్ ఎంక్వైరీ వేశామన్న సీఎం రేవంత్
### -కమిషన్‌ను రద్దు కాలేదని వెల్లడి
### -చైర్మన్‌ని మార్చాలని సుప్రీంకోర్టు సూచించింది
### -కేసీఆర్ హయాంలో ఒక్క యూనిట్ కూడా సోలార్ ఉత్పత్తి కాలేదు
### -విద్యుత్ కొనుగోళ్లలో వేల కోట్ల అవినీతి జరిగింది
### విద్యుత్ కమిషన్ విచారణపై బీఆర్ఎస్‌కు ఎందుకు ఉలికిపాటు
### -సాయంత్రంలోగా కొత్త చైర్మన్ వస్తారన్న సీఎం

హైదరాబాద్, జులై 29: విద్యుత్ కొనుగోళ్లపై జ్యూడిషియల్ కమిషన్ విచారణ జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. సాయంత్రంలోగా కొత్త చైర్మన్ వస్తారని తెలిపారు. విద్యుత్ విచారణ కమిషన్ ను రద్దు చేయాలని కేసీఆర్ కోర్టుకెళ్లారని, సుప్రీం కోర్టు విద్యుత్ కమిషన్ ను రద్దు చేయలేదని, విచారణ కమిషన్ చైర్మన్ ను మార్చి విచారణ చేయాలని సూచించిందన్నారు.

కమిషన్ వివరాలు అడిగితే కేసీఆర్ ఇవ్వలేదని మండిపడ్డారు. విభజన జరిగేటప్పుడు తెలంగాణకు 54 శాతం విద్యుత్ కేటాయింపులు చేశారని చెప్పారు. విద్యుత్ కేటాయింపుల కోసం జైపాల్ రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రారంభించిన విద్యుత్ ప్లాంట్లను కేసీఆర్ పూర్తి చేశారన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క యూనిట్ కూడా సోలార్ పవర్ ఉత్పత్తి చేయలదేని చెప్పారు. విద్యుత్ విచారణపై బీఆర్ఎస్ నేతలకు భయమెందుకని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లలో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

బినామీలకే కట్టబెట్టి దోచుకున్నారు

అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు తీసుకుని రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆరోపించారు.

పవర్ ప్లాంట్ లు బీహెచ్ఈఎల్ కు ఇస్తున్నామని చెప్పి వాళ్ల నుంచి సివిల్ కాంట్రాక్టులు వీళ్ల బినామీలకు ఇప్పించి కమిషన్లు తీసుకున్నారని మండిపడ్డారు. సబ్ క్రిటికల్ నుంచి సూపర్ క్రిటికల్ కు అప్ గ్రేడ్ చేయాలని కేంద్రం సూచిస్తే కమీషన్లకు కక్కుర్తి పడి సబ్ క్రిటికల్ యంత్రాగాన్ని కొనుగోలు చేసి వాటికి టెండర్లు పిలిచి వాటితో పవర్ ప్లాంట్ కట్టించారన్నారు.

### భద్రాద్రి ప్లాంట్‌లో తరచూ సమస్యలే..

దీంతో.. ఎప్పుడూ భద్రాద్రి పవర్ ప్లాంట్ లో ఏదో ఓ సాంకేతిక సమస్య తలెత్తుతూ వస్తుందని సీఎం రేవంత్? చెప్పారు. రెండున్నర ఏళ్లో పూర్తి చేయాల్సిన ప్రాజెక్టును తొమ్మిదున్నర ఏళ్ల గడుస్తున్నా పూర్తి చేయలేదని విమర్శించారు. గుజరాత్ కు చెందిన కంపెనీ నుంచి రూ. 1000 కోట్లు కమిషన్లు తీసుకుని పవర్ ప్రాజెక్టులు కట్టారని చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్ కూడా ఇలాగే చేశారని సీఎం మండిపడ్డారు. నిజాలు చెబితే బుకాయించే పనులు చేస్తున్నారని సోనియా దయతో జైపాల్ రెడ్డి కృషితో ఇప్పుడు తెలంగాణ వెలుగులు చిమ్ముతుందని తెలిపారు.



# అసెంబ్లీలో విద్యుత్ మంటలు.. జగదీష్, మంత్రి కోమటిరెడ్డి మధ్య లడాయి..

### విద్యుత్ రంగ చర్చలో జగదీష్, మంత్రి కోమటిరెడ్డి మధ్య ఫైట్
### -ఒకరిపై ఒకరు విమర్శల వర్షం
### -సభలో వ్యక్తిగత విషయాలు
### -కాంగ్రెస్ చలువతోనే తెలంగాణకు 24 గంటల విద్యుత్
### -కెసిఆర్ సారధ్యంలోనే ఆ ఘనత
### -విద్యుత్ కొనగోళ్లలో కేసిఆర్ చేతివాటం
### -విద్యుత్ మంత్రికి హస్తం
### -నిరూపిస్తే రాజకీయాలకు దూరం అన్న జగదీష్
### -ముందుంది ముసళ్ల పండగన్నమంత్రి



హైదరాబాద్, జులై 29: విద్యుత్ రంగ చర్చలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మధ్య మాటల యుద్ధం తారస్థాయిలో జరిగింది.. అసలు కంటే వ్యక్తిగత విషయాలపైనే ఇద్దరు ఫోకస్ చేసుకున్నారు.. అసెంబ్లీలో విద్యుత్ పైచర్చ సందర్భంగా ఈ మధ్య మాటల తూటాలు పేలాయి. సవాళ్లు ,ప్రతిసవాళు విసురుకున్నారు.

జగదీష్ రెడ్డిపై కోమటరెడ్డి విరుచుకుపడ్డారు. జగదీష్ రెడ్డికి నల్గొండలో క్రిమినల్ రికార్డ్ ఉందని ఆరోపించారు. జగదీష్ రెడ్డిపై ఆరోపణలు నిరూపించకపోతే తన ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు కోమటిరెడ్డి. తనపై ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు జగదీష్ రెడ్డి. కోమటి రెడ్డి సవాల్ ను స్వీకరిస్తున్నానని చెప్పారు జగదీష్ రెడ్డి.

అసెంబ్లీలో కోమటిరెడ్డి వ్యాఖ్యలు

జగదీశ్ రెడ్డి జీవితమంతా కిరాయి హత్యలు, దొంగతనాలు అంటూ మండిపడ్డారు మంత్రి. జగదీష్ రెడ్డి 16 ఏళ్లు కోర్టుల చుట్టూ తిరిగారన్నారు. జగదీశ్ రెడ్డిపై చేసిన ఆరోపణలు నిరూపిస్తానని సవాల్ చేశారు. ఆరోపణలు నిరూపించకుంటే ఎమ్మెల్యే, మంత్రి పదవికి రాజీనామా చేస్తానని నిండు సభలో మంత్రి ప్రకటించారు. సూర్యపేట రైస్ మిల్లులో జగదీష్ రెడ్డి దొంగతనం చేశారంటూ ఆరోపణలు గుప్పించారు.. రాంరెడ్డి హత్యకేసులో ఏ6 , ఓ హత్యకేసులో ఏ2 నిందితుడు జగదీశ్ రెడ్డి అంటూ చిట్టా విప్పారు.

నల్గొండలో జగదీష్ రెడ్డికి క్రిమినల్ రికార్డ్ ఉండటంతో మా జిల్లా నుంచి ఏడాది బహిష్కరించారన్నారు మంత్రి.

### నిరూపించు.. రాజీనామా చేస్తా- జగదీష్ రెడ్డి

కాగా జగదీశ్ రెడ్డి సీఎం, మంత్రి వ్యాఖ్యలను ఖండించారు. తాను హత్య కేసుల్లో నిందితుడినని నిరూపిస్తే ఇదే సభలో ముక్కు నేలకు రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజకీయాల నుంచి తప్పుకుంటానని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి ఎందుకు జైలు జీవితం గుర్తు చేసుకుంటున్నారో.. మళ్లీ అక్కడికే వెళ్లాలని అనుకుంటున్నారని కౌంటర్ ఇచ్చారు. తనకు కూడా చంచల్‌గూడ జైలు జీవితం గుర్తుందని అంటూ . తెలంగాణ ఉద్యమం కోసం జైలుకు పోయానన్నారు. ఆయనకు చర్లపల్లినే గుర్తు ఉంటది మళ్లీ యాది చేసుకంటున్నారని అన్నారు. సీఎం రేవంత్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనపై ఆరోపణల చేసిన ప్రతి అక్షరం రికార్డుల నుంచి తొలగించాలి అని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

తాను చాలెంజ్ వేస్తున్నా.. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడిన దాంట్లో ఒక్కటి నిరూపించినా.. అందులో ఒక్కటి రికార్డు చూయించినా నేను ఈ సభలో ముక్కు నేలకు రాసి రాజీనామా చేసి పోతా.. రాజకీయాల్లో నుంచి వెళ్లిపోతా..! తప్పుని నిరూపించకపోతే కోమటిరెడ్డి, రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాయాలి.. పదవులకు రాజీనామా చేయాలి. తాను తన చాలెంజ్‌కు సిద్ధంగా ఉన్నానని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

### హౌజ్ కమిటీ వేయండి.. నిగ్గు తేలుతుంది..

తాను ఎక్కడా తప్పు మాట్లాడలేదన్నారు జగదీష్ రెడ్డి. ఉపేక్షించం అని శాసనసభ వ్యవహారాల మంత్రి భయపెట్టిస్తున్నారు. ఒకటి కాదు మూడు హత్య కేసులు పెట్టారు తనపై అని పేర్కొన్నారు. ఈ మూడింటిలో కోర్టు నిర్దోషిగా తేల్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం కేసులు తప్ప.. వేరే కేసులు లేనే లేవని తేల్చి చెప్పారు. ఒక్క కేసు నా మీద ఉన్న పెట్రోల్ బంక్ దొంగతనం కేసు అని అన్నారు. మిర్యాలగూడ కేసు మీద హౌస్ కమిటీ వేయండి.. ఒక్కటి నిర్ధారణ కాకపోయినా.. ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాను. సీఎం, మంత్రి కూడా ముక్కునేలకు రాసి రాజీనామా చేయాలి అని జగదీవ్ రెడ్డి డిమాండ్ చేశారు.

### ఆయనకు ప్రతిపక్ష హోద వేస్ట్. రాజగోపాల్ రెడ్డి

రంగాన్ని అప్పుల్లోకి నెట్టేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,. అప్పుల నుంచి విద్యుత్ రంగాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సీఎంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శలు సరికాదన్నారు. సభకు రాని కెసిఆర్ కు విపక్ష హోదా వేస్ట్ అంటూ వ్యాఖ్యానించారు.

"గత ప్రభుత్వ తప్పులు ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసింది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు అదనపు విద్యుత్‌ను యూపీఏ ప్రభుత్వం కేటాయించింది. జనాభా ప్రాతిపదికన కాకుండా రాష్ట్ర అవసరాల మేరకు విద్యుత్ కేటాయించారు. కేసీఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నాం. కేసీఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే.. కేసీఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదన్నారు. సభకు రానప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఎందుకు? ప్రతిపక్ష నేత హోదా కేసీఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చు కదా? విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నాం. యాదాద్రి పవర్ ప్లాంట్ లాభదాయకం కాదని 2018లోనే చెప్పాను. ఈ ప్లాంట్ పూర్తయ్యేందుకు అదనంగా రూ.11 వేల కోట్లు ఖర్చు పెట్టాలి. డబ్బులు పోయినా యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తికాలేదు. రామగుండంలో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో ఉంది. అక్కడ కాకుండా యాదాద్రిలో ఎందుకు నిర్మించారు?" అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

# బీహార్‌లో కూలుతున్న బ్రిడ్జిలు..

## -నితీశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

బీహార్ జూలై 29 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్ ): బీహార్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఇటీవలే రాష్ట్రంలో అనేక బ్రిడ్జిలు ఒకదాని తర్వాత ఒకటి కూలిపోయిన విషయం తెలిసిందే.దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో తరచూ బ్రిడ్జి కూలిన ఘటనలపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ఇవాళ విచారణ చేపట్టింది.బ్రిడ్జిలు కూలిన ఘటనలపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇవాళ విచారణ చేపట్టింది. ఈ మేరకు పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ బీహార్ ప్రభుత్వానికి నోటీసులు పంపింది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న అన్ని వంతెనలు, నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలపై అత్యున్నత స్థాయి స్ట్రక్చరల్ ఆడిట్ నిర్వహించాలని సూచించింది. అదేవిధంగా సాధ్యాసాధ్యాలను బట్టి బలహీనమైన నిర్మాణాలను కూల్చివేయడం లేదా పునర్నిర్మించడం వంటి చర్యలు చేపట్టాలని నోటీసుల్లో పేర్కొంది.కాగా, సివాన్, సరన్, మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లో ఇటీవలే పదుల సంఖ్యలో వంతెనలు కుప్పలకూలిన విషయం తెలిసిందే. వాటిలో కొన్ని వంతెనలు పాతవి కాగా, మరికొన్ని నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలు. భారీ వర్షాల కారణంగా ఒకదాని తర్వాత ఒకటి కూలిపోయాయి. దీంతో బ్రిడ్జిల నాణ్యతపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

# కోచింగ్ సెంటర్ దుర్ఘటనపై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు




న్యూఢిల్లీ, జులై 29 : ఢిల్లీ లోని ఓల్డ్ రాజేందర్ నగర్ లో ఓ కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై ఉవ్వెత్తున నిరసన వ్యక్తమవుతోంది.

ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలంలూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఇక ఈ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభలో మాట్లాడారు. కోచింగ్ సెంటర్‌లో జరిగిన దురదృష్టకర ఘటనలో ముగ్గురు యూపీఎస్సీ అభ్యర్థులు ప్రాణాలు కోల్పోవడం విచారకరమని అన్నారు.

ఈ ఘటనలో అధికారుల నిర్లక్ష్యం ఉందని, జవాబుదారీతనం నెలకొనేలా చూస్తే ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడటం తమ బాధ్యతని మంత్రి వివరించారు. కాగా, కోచింగ్ సెంటర్‌లో విషాద ఘటనపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమవడంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఈ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించి నీరు సాఫీగా సాగేందుకు అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో తొలగిస్తున్నారు. డ్రైయిన్లకు అడ్డుగా నిర్మించిన బ్లాక్స్‌ను పొక్లెయిన్‌లతో సిబ్బంది తొలగిస్తున్నారు.

# బెంగాల్ విభజనను ప్రతిఘటిస్తాం: సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా, జులై 29 : పశ్చిమ బెంగాల్‌ను విభజించే అన్ని ప్రయత్నాలను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రతిఘటిస్తుందని సీఎం మమతా బెనర్జీ (ఓజీఎజీబిజీ ఃజీనివతీతీవవ) తెలిపారు. సోమవారం ఆ రాష్ట్ర అసెంబ్లీలో ఈ మేరకు స్పష్టం చేశారు. 'బెంగాల్‌ను విభజించేందుకు వారిని రానివ్వండి. దాన్ని ఎలా అడ్డుకోవాలో వారికి చూపుతాం' అని అన్నారు. బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని జిల్లాలను విభజించి కొత్తగా కేంద్ర పాలిత ప్రాంతం ఏర్పాటు చేయాలని జార్ఖండ్‌కు చెందిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ వెబ్‌సైట్లు, డిజిటల్ విధ్వంసం..

## -చర్యలు తీసుకోకుంటే కోర్టుకు వెళ్తాం: కెటిఆర్

హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: గత ప్రభుత్వ సమాచారం, వివరాలు తెలంగాణ ప్రజల ఆస్తి అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, డిజిటల్ విధ్వంసంపై ఎక్స్‌లో కెటిఆర్ స్పందించారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని సిఎస్ శాంతికుమారిని కోరారు. కెసిఆర్ హయాంలోని సమాచారం, వివరాలు ఎందుకు తొలగించారని అడిగారు. భావితరాల కోసం ఈ డిజిటల్ సంపదను రక్షించాలని డిమాండ్ చేశారు. తగిన చర్యలు తీసుకోకుంటే న్యాయపరంగా ముందుకు వెళ్తామని హెచ్చరించారు.

# తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారింది

## -బీజేపీ నేత తమిళిసై సౌందర్‌రాజన్

చెన్నయ్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్ );తమిళనాడులో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా దిగజారిందని బీజేపీ నేత తమిళిసై సౌందర్‌రాజన్ ఆరోపించారు. ప్రతిరోజూ మనం రాజకీయ హత్యల వార్తలు చూస్తున్నామని, ఈరోజు ఉదయం శివగంగలో ఏఐఏడీఎంకే నేత, బీజేపీ కార్యకర్త హత్య వార్తలు వెలుగుచూశాయని ఆమె పేర్కొన్నారు. డీఎంకే సర్కార్ శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారించాలని అన్నారు.అధికారులు, కలెక్టర్లను మార్చినంత మాత్రాన పరిష్కారం లభించదని అన్నారు. తమిళనాడు సీఎం నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కావాల్సిందని చెప్పారు. అలాంటి కీలక సమావేశాన్ని వారు బహిష్కరించడం తమిళనాడు అభివృద్ధిని అడ్డుకోవడమేనని ఆమె మండిపడ్డారు. మరోవైపు తమిళనాడులో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణన్ తిరుపతి ఆరోపించారు.రాష్ట్రంలో జరుగుతున్న మూక దాడులు, కిరాయి హత్యలను ప్రభుత్వం నిరోధించలేకపోతోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, అధికార యంత్రాంగం నిరాసక్తత కారణంగా ఈ పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, శాంతి భద్రతలను పర్యవేక్షించలేకుంటే ప్రభుత్వం తక్షణమే వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు.

# పరవళ్లు తొక్కుతున్న బొగత జలపాతం.. పర్యాటకుల సందడి

హైదరాబాద్, జులై 29: తెలంగాణ 'నయాగార'గా గుర్తింపు పొందిన అందాల బొగత జలపాతం జలకళను సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న వానలతో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీంతో ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలో ఉన్న బొగత జలపాతానికి వరద పోటెత్తింది. జలపాతానికి భారీగా నీరు వస్తుండటంతో జలసవ్వడులను చూడటానికి పర్యాటకులు క్యూకడుతున్నారు. ప్రకృతి సోయగాలను తిలకించి మైమరచిపోతున్నారు. కాగా, వరద ఉధృతితో ఇటీవల బీటెక్ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందడంతో సందర్శనను నిలిపివేసిన విషయం తెలిసిందే. నాలుగు రోజుల అనంతరం బొగత జలపాతం సందర్శన నిన్న తిరిగి ప్రారంభమైంది. దీంతో పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు.

### నేటి కందం- నేటికీ అందం

జగదాధారుని కృపతో
నగణితమగు శోభతోడ నచ్చెరువులతో
తగు పద్ధతిలో బాగ్దాద్
నగరము స్థాపింపబడియె నాగరికతతోన్

(30-7-762న బాగ్దాద్ నగర స్థాపన జరిగింది)



-రాధశ్రీ
సెల్:9494481210

# ఆపదలో ఆపన్న హస్తం స్నేహబంధం !

1930 దశకంలో హాల్‌మార్క్ కార్డుల వ్యాపారి 'జోయ్ హాల్' ప్రవేశ పెట్టిన స్నేహ దినాన్ని 1958 నుంచి పెరుగ్వే 'అంతర్జాతీయ స్నేహ దినం (ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ డే)'గా పాటించడం ప్రారంభించింది. 2011 నుంచి ఐరాస కూడా అంతర్జాతీయ స్నేహ దినాన్ని 30 జూలైన పాటించడానికి నిర్ణయం తీసుకున్నది. త్యాగానికి నిలువెత్తు నిదర్శనం స్నేహం. అవధులు లేని స్నేహాన్ని ఆస్వాదించడం ఓ నేర్పు. మనసులో మాటను, సుఖదుఃఖాలను పంచుకోవడానికి, మనసును తేలిక పరుచుకోవడానికి ఓ అద్భుత నేస్తం కావాలి. అమ్మ రొమ్ము పాల వలె స్నేహ హస్తం కూడా స్వచ్ఛమైంది, పవిత్రమైందని మనకు తెలుసు. స్నేహితులు లేని వారు ఎక్కడా ఉండరు. ప్రాణమిత్రులను కలిగి ఉండడం ఓ అదృష్టం. అదో దేవుడిచ్చిన అపురూప వరం. స్నేహబంధానికి కులమతాల విబేధాలు లేవు, ఆర్థిక అంతరాలు ఉండవు.

అంతర్జాతీయ స్నేహ దినం–2024 థీమ్:

**(30 జూలై 'అంతర్జాతీయ స్నేహ దినం' సందర్భంగా)**

స్నేహ బంధాన్ని గుర్తు చేసుకోవడం, ప్రాణమిత్రులను కలుసుకోవడం, ఉల్లాసంగా ప్రకృతిలో మిత్రులతో గడపడం, కలిసి భోజనాలు చేయడం, స్నేహితునికి కృతజ్ఞతలు తెలపడానికి వేదికగా ప్రతి ఏటా 30 జూలైన ఐరాస అంతర్జాతీయ స్నేహ దినాన్ని జరుపుకోవాలని నిర్ణయించింది. ఆగస్టు తొలి ఆదివారం, అనగా 04 ఆగస్టు 2024న ప్రపంచ దేశాలు 'స్నేహ దినం' పాటించుట కూడా చూస్తున్నాం. 2024 అంతర్జాతీయ స్నేహ దినం థీమ్‌గా "సరిహద్దులు దాటి స్నేహ బంధాలు (సెలెబ్రేటింగ్ బాండ్స్ ఎక్రాస్ బార్డర్స్)" అనబడే థీమ్‌ను తీసుకొన్నారు. వ్యక్తుల మధ్యనే కాకుండా ఇరుగుపొరుగు, ప్రాంతాలు, దేశాల మధ్య కూడా స్నేహ వాతావరణం పెరిగితేనే విశ్వ శాంతి కపోతం స్వేచ్ఛగా ఎగురుతుంది. ఈ రోజున ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు ధరించడం, గ్రీటింగ్ కార్డులు/కానుకలు పంచుకోవడం, ప్రకృతి ఒడిలో ఆనందంగా గడపడం, కేకులు కట్ చేయడం, మిఠాయిలు పంచుకోవడం లాంటి కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు.

ప్రతి ఒక్కరి జీవితంలో ఓ అంతర్భాగం స్నేహం:

'నీ స్నేహితులెవరో తెలిస్తే నీ వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చనే' నినాదం మనకు విధితమే. స్నేహం జీవితంలో ఓ అంతర్భాగం. కుటుంబ సభ్యులు, సమీప బంధువులతో పంచుకోలేని పలు రహస్యాలకు కూడా స్నేహితులతో పంచుకోవడం, సలహాలు తీసుకోవడం, మనసులో భావాలను పంచుకోవడం జరుగుతుంది.

స్నేహ బంధం భర్తీ చేయలేని అద్వితీయ భావన. సద్గుణాలు కలిగిన ప్రాణమిత్రులను పొందడం ఓ అదృష్టం. స్నేహితుడు బాధలో ఉపశమన లేపనంగా, సంతోషాన్ని రెట్టింపు చేసే చెలిమి చెలిమగా, ప్రమాదంలో ఆపన్న హస్తంగా, జారినపుడు ఊత కర్రగా, ఎదుగుదలలో పారాచూట్‌గా, ఆనందసాగర సృష్టికర్తగా, ఒత్తిడిని హరించే మృదు స్పర్శగా, అనారోగ్యంలో ఔషధంగా, మండుటెండలో మహావృక్ష నీడగా, నిరుత్సాహ వేళ ప్రేరణ కలిగించే అమృత హస్తంగా, ప్రతి పశ్నకు సరైన సమాధానమైన 'పవిత్ర స్నేహబంధం' బహు విధాలుగా ఉపయోగపడుతున్నది. హృదయాలను గెలిస్తే సంతోషాల ఆకాశంలో విహరించ వచ్చు. సుఖాలను, స్వార్థాలను, లాభాలను మాత్రమే కోరుకునేది స్నేహం అసలే కాదు. జీవితాంతం మన వెంట వచ్చే అపురూప నిధి స్నేహం. పిల్లల నుండి పండు ముసలి వరకు స్నేహితుడు లేని వ్యక్తులు కనిపించరు. అందమైన స్నేహ భావానికి జంతువులు కూడా మినహాయింపు కాదు. దేవుడిచ్చిన అమూల్య వరమైన స్నేహంలో స్వార్థ బుద్ధికి తావు ఉండదు. వర్ణ వర్గ జాతి విభేదాలను మరిపించి మానసికంగా ఏకం చేయగల అపారశక్తి స్నేహానికి ఉంటుంది. సంతోషాన్ని పంచుకునే వారు సాధారణ స్నేహితులైతే, దుఃఖంలో కన్నీటిని దుడిచే హస్తలే అసలైన స్నేహితులు అవుతారు.

అందరికీ అనేకులు స్నేహితులు ఉంటారు, కాని కొందరు మాత్రమే ప్రాణమిత్రులు ఉంటారనేది వాస్తవం. స్నేహానికి దూరాలు, కంచెలు, సరిహద్దులు అడ్డురాలేవు. స్నేహబంధం పరమ పవిత్రమని, స్నేహ హస్తాన్ని కోరుకోవడం, స్నేహహస్తాన్ని అందించడం మనందరి కర్తవ్యమని తెలుసుకుందాం. స్నేహానికి ఇవ్వడం మాత్రమే తెలుసు, తీసుకోవడాన్ని ఆశించదు. అపురూపమైన స్నేహాన్ని ఆసాంతం ఆస్వాదిద్దాం, ఆనందతీరాలు విహరిద్దాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# వంద బిలియన్ యుఎస్ డాలర్ల మేర సౌదీ పెట్టుబడికి క్రియాత్మక సమర్థనను అందించాలన్న

## భారత ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటించిన ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ

న్యూఢిల్లీ, జులై 29 :పెట్టుబడులపై భారతదేశం–సౌదీ అరేబియా ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ మొదటి సమావేశాన్ని వర్చువల్ పద్ధతిలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రధాన మంత్రి కి ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ పి.కె. మిశ్రా, సౌదీ ఇంధన శాఖ మంత్రి ప్రిన్స్ అబ్దుల్‌అజీజ్ బిన్ సల్ మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్ లు సహాధ్యక్షత వహించారు.

టాస్క్ ఫోర్స్ లో భాగమైన సాంకేతిక బృందాల మధ్య జరిగిన చర్చలను ఇరు పక్షాలు సమీక్షించాయి.

శుద్ధీకరణ, పెట్రో కెమికల్ ప్లాంటులు, నూతన మరియు పునరుత్పాదక ఇంధనం, విద్యుత్తు, టెలికం, నూతన ఆవిష్కరణలు సహా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ద్వైపాక్షిక పెట్టుబడులకు గల అవకాశాలపై నిర్మాణాత్మక చర్చలు జరిగాయి.

పరస్పర ప్రయోజనకరమైన పద్ధతిలో రెండు వైపులా పెట్టుబడులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తీసుకోదగిన చర్యలపైన ఉభయ పక్షాలు సమగ్ర సమీక్ష జరిపాయి.

సౌదీ అరేబియా యువరాజు, ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా చేసిన ప్రకటన మేరకు పెట్టే 100 బిలియన్ యుఎస్ డాలర్ ల సౌదీ పెట్టుబడులకు అవసరమయ్యే క్రియాత్మక అండదండలను అందించాలని భారత ప్రభుత్వం వ్యక్తం చేసిన దృఢ సంకల్పాన్ని ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ పునరుద్ఘాటించారు.

మరిన్ని చర్చలను జరపాలని, నిర్దిష్ట పెట్టుబడులపై ఒక అంగీకారానికి రావడానికి ఇరు పక్షాల సాంకేతిక బృందాల మధ్య సంప్రదింపులను క్రమం తప్పక కొనసాగించాలని ఉభయ పక్షాలు సమ్మతించాయి. చమురు, గ్యాస్ రంగంలో పరస్పర ప్రయోజనకర పెట్టుబడిపై తదుపరి దఫా చర్చలను జరపడం కోసం పెట్రోలియం కార్యదర్శి నాయకత్వంలో ప్రతినిధి వర్గం సౌదీ అరేబియాకు వెళ్లనుంది. భారతదేశంలో సావరిన్ వెల్త్ ఫండ్ పిఐఎఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయవలసిందిగా కూడా సౌదీ అరేబియా ను ఆహ్వానించారు.

ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ తదుపరి విడత సమావేశంలో పాల్గొనడానికి భారతదేశానికి రావాలని సౌదీ అరేబియా ఇంధన శాఖ మంత్రిని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆహ్వానించారు.

2023 సెప్టెంబరులో సౌదీ యువరాజు, ప్రధాని శ్రీ మొహమ్మద్ బిన్ సల్ మాన్ బిన్ అబ్దుల్‌అజీజ్ అల్ సౌద్ అధికారిక పర్యటన పై భారత్ వచ్చినప్పుడు ఆయన భారత ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తో జరిపిన చర్చల ఫలితంగా ద్వైపాక్షిక పెట్టుబడులకు మార్గాన్ని సుగమం చేయడానికి ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశారు. ఈ ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ లో ఉభయ పక్షాలకు చెందిన సీనియర్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. ఈ టాస్క్ ఫోర్స్ సభ్యులలో భారతదేశం తరఫున నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, ఆర్థిక వ్యవహారాలు, వాణిజ్యం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్ఇఎ), డిపిఐఐటి, పెట్రోలియం మరియు సహజవాయు కార్యదర్శులు ఉన్నారు.

# గన్నవరం నుంచి ఎయిర్ సర్వీసులు పెంచండి..

**–అన్ని ప్రాంతాలకు సర్వీసులు కల్పించండి**
**–ఇండిగో సర్వేను తక్షణం అమలు చేయండి**
**–కేంద్రమంత్రికి విజయవాడ ఎంపి విజ్ఞప్తి**

అమరావతి, జులై 29: ఆంధ్ర ప్రదేశ్ కి రాజధాని అమరావతి ప్రాంతం నుంచి దేశంలోని అన్ని ప్రాంతాలకు విమాన సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర విమాన యాన శాఖ మంత్రి రామ్మో హన్ నాయుడును విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అభ్యర్థించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు విమానయాన కనెక్టివిటీ పెంచాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా సోమవారం నాడు రామ్మోహన్ నాయుడుని కేసినేని కలిశారు. తొలుత మంత్రికి అభినందనలు తెలిపి, తన నియోజకవర్గంలోని గన్నవరం ఎయిర్ పోర్ట్ అభివృద్ధిపై వినతి పత్రాన్ని అందజేశారు.

**విజయవాడ నుంచి ఇతర ప్రాంతాలకు సర్వీసులు..**

విజయవాడ నుంచి వారణాసి వయా వైజాగ్, విజయవాడ నుంచి కలకత్తా వయా విశాఖపట్నం, విజయవాడ నుంచి బెంగళూరు వయా హైదరాబాద్ లేదా కొచ్చి, విజయవాడ నుంచి అహ్మదాబాద్, విజయవాడ నుంచి పుణే విమాన సర్వీసుల ప్రారంభించాలని అభ్యర్థించారు. ఇండిగో సంస్థ సర్వే చేసిన ఈ మార్గాల్లో విమాన సర్వీసులు తక్షణం ప్రారంభించేలా చూడాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

# చెట్ల పెంపకమే ముందు తరాలకు అందించే గొప్ప ఆస్తి

**–సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి**
**–కర్నూలులోని సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కాలేజీలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం**
**–కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు.**



న్యూఢిల్లీ, జులై 29 :చెట్ల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్పబహుమతి అని, మొక్కలు నాటి సంరక్షించుకుంటూ పర్యావరణాన్ని కాపాడుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అడిషనల్ డైరక్టర్ జనరల్ రాజేంద్ర చౌధురి తెలిపారు. భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, క్షేత్ర కార్యాలయం, కర్నూలు ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కాలేజీలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజేంద్ర చౌధురి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు.

కర్నూలు ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ హెడ్ డి. మురళి మాటాడుతూ, భవిష్యత్ తరాలకు మెరుగైన పర్యావరణంతో కూడిన భూమిని అందించటం మనందరి బాధ్యతగా గుర్తించాలని పేర్కొన్నారు. పర్యావరణం ప్రగతిని సమన్వయం చేసుకుని ముందుకు సాగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమౌతుందని, ఈ దిశగా విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క స్ఫూర్తిని వ్యాప్తి చేయటంలో భాగస్వాములు కావాలని సూచించారు.

దేశంలో అటవీ ప్రాంత విస్తీర్ణం పెంచటంతో పాటు, పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ఆవశ్యకవన్న ప్రధానమంత్రి మాటలు అక్షర సత్యాలని కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కులు నాటడమే కాకుండా, ఆ చాయా చిత్రాన్ని తీసుకుని హ్యాష్ ట్యాగ్ లను వినియోగించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. శాంత, సెంట్రల్ బ్యూర్ ఆఫ్ కమ్యూనికేషన్ కార్యాలయ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కర్నూలులోని ఆల్ ఇండియా రేడియో కేంద్రాన్ని సందర్శించిన రాజేంద్ర చౌధురి, స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

# రాబోయే యుగే యుగీన్ భారత్ మ్యూజియం గురించి ఆగస్టు 1 నుంచి 3 వరకు

## మూడు రోజుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్న సాంస్కృతిక మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 29 :2024 ఆగస్టు 1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు ఢిల్లీలోని భారత్ మండపంలో రాష్ట్ర మ్యూజియం సదస్సును(స్టేట్ మ్యూజియం కాంక్లేవ్) నిర్వహించనున్నారు. ప్రపంచ ఉత్తమ పద్ధతులను ప్రతిబింబించే విధంగా 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం' ఉండాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేయడంలో రాష్ట్ర మ్యూజియాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య సహకారాన్ని పెంపొందించటమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరగనుంది. 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం' కోసం భారతదేశ కళాఖండాల సంపదపై సమగ్ర అవగాహనను పెంపొందించడానికి ఈ సదస్సులో ఆయా రాష్ట్రాల సేకరణలపై వివరణాత్మక విషయాలు అందించాలని రాష్ట్రాలను ఆహ్వానించారు.

దేశవ్యాప్తంగా రెసిడెంట్ కమిషనర్లు, మ్యూజియాల డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు, క్యూరేటర్లు, పరిశోధకులతో సహా వివిధ భాగస్వాముల బృందాన్ని ఈ సదస్సు ఒకచోట సమావేశపరచనుంది. గ్లామ్ విభాగం సంయుక్త కార్యదర్శితో పాటు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సహా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు కూడా హాజరుకానున్నారు. సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ ఈ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు చెందిన గ్లామ్ డివిజన్ చేపట్టిన సామర్థ్యాన్ని పెంపొందించే కార్యక్రమాలలో స్టేట్ మ్యూజియం సదస్సు మూడవ దశను తెలియజేస్తుంది. జూన్ 14, 2024న జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల సంప్రదింపులు, ఫ్రాన్స్ మ్యూజియాల భాగస్వామ్యంతో మ్యూజియం ప్రొఫెషనల్స్ (డైరెక్టర్లు, క్యూరేటర్లు, ఎడ్యుకేషన్ ఆఫీసర్లు మరియు కన్జర్వేటర్లు)తో జూన్ 25–29, 2024 మధ్య జరిగిన సహకార వర్క్‌షాప్ విజయవంతం కావడంతో భారతదేశంలో మ్యూజియాలకు సంబంధించిన వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఈ సదస్సును లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రఖ్యాత భారతీయ, అంతర్జాతీయ మ్యూజియం నిపుణుల నేతృత్వంలో సామర్థ్య పెంపుకు సంబంధించి వరుస వర్క్‌షాప్‌ల ద్వారా సేకరణ, నిర్వహణ, ఆర్కైవింగ్, మ్యూజియం పరిపాలనలో అవసరమైన నైపుణ్యాలతో రాష్ట్ర స్థాయి సిబ్బందిని సన్నద్ధం చేయాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. నార్త్, సౌత్ బ్లాక్ ఆర్కిటెక్చర్, మెటీరియాలిటీ, పరిరక్షణలో ప్రపంచ ఉత్తమ పద్ధతులు, లలిత కళాఖండాల నిర్వహణ, సేకరించిన వాటి నిర్వహణ, క్యురేషన్, మ్యూజియం నిర్వహణ వంటి వివిధ అంశాలపై దేశవిదేశాలకు చెందిన నిపుణులతో మాస్టర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

సైద్ధాంతిక పరిజ్ఞానానికి మించి, ప్రత్యక్ష శిక్షణతో పాటు 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం' (వైవైబీఎం) ప్రాజెక్టు విషయంలో సంభావ్య భాగస్వాములతో సంబంధాలు పెంచుకోవటానికి అవకాశాన్ని ఈ మూడు రోజుల కార్యక్రమం కల్పిస్తుంది. అదనంగా, రాష్ట్ర స్థాయి మ్యూజియాల అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి ఇటీవల నవీకరించిన మ్యూజియం గ్రాంట్ పథకం, స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్స్ సహా అందుబాటులో ఉన్న పథకాల గురించి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ వివరాలు అందించనుంది.

# నిండుగా శ్రీశైలం జలాశయం ..

## నేటి సాయంత్రం గేట్లు ఎత్తివేత

అమరావతి, జులై 29: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో శ్రీశైలం జలాశయం నిండు కుండలా మారింది.. ఇప్పుడు శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో రూపంలో 4.37 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది..

మరోవైపు.. కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాల్లో.. విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.. విద్యుత్ ఉత్పత్తి కోసం ఇప్పటికే 62,725 క్యూసెక్కుల నీటిని వాడుతూ దిగువకు విడుదల చేస్తున్నారు.. శ్రీశైలం డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 877.80 అడుగులుగా ఉంది.. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 171 .8625 టీఎంసీలకు పైగా ఉంది.. సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 880 అడుగులకు చేరువగా వెళ్లే అవకాశం ఉన్నట్టుగా అంచనా వేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఈ రోజే శ్రీశైలం డ్యామ్ గేట్లు ఎత్తేందుకు సిద్ధం అయ్యారు అధికారులు.. నేటి సాయంత్రం శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తి.. దిగువకు నీరు విడుదల చేయనున్నట్టు ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించారు..

ఇప్పటికే జలాశయానికి గంటగంటకు పెరుగుతోంది వరదప్రవాహం..

ఓవైపు కృష్ణా నది, మరోవైపు తుంగభద్ర రివర్ నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చి శ్రీశైలంలో చేరుతోంది..

దీంతో సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం జలాశయం రేడియల్ క్రెస్టు గేట్లు ఎత్తి నాగార్జున సాగర్‌కు నీటిని వదలనున్నారు అధికారులు మొదట నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు..

# సింహాద్రి అప్పన్నకు బంగారు హారం కానుక



అమరావతి, జులై 29: వరాహ లక్ష్మీనరసింహస్వామి వారికి విశాఖపట్నం మధురవాడ దుర్గా నగర్ కు చెందిన కె సూర్యచంద్రరావు 350 గ్రాముల బంగారు హారంన నేడు కానుకగా అందజేశారు.. ఆలయ కార్య నిర్వహణ అధికారి యస్ శ్రీనివాసమూర్తి ఈ హారమును ఆలయ గోల్డ్ అప్రైజర్ సాంబమూర్తి పరీక్షించి తూనిక వేసి తదుపరి భక్తునికి రసీదును అందజేశారు. కాగా, వారికి ఆలయ సంప్రదాయ ప్రకారము బేడ ప్రదక్షణ చేయించి అంతరాలయంలో స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. తదుపరి ఆలయ వేద పండితుల వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సహాయ కార్య నిర్వహణ అధికారి ఎన్ ఆనంద్ కుమార్ వారిని దుశ్శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు . ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసచార్యులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాన్ రాజు సహాయకారి నిర్వహణాధికారి రమణమూర్తి ఆనంద్ కుమార్ పి ఆర్ ఓ నాయుడు ఆలయ సిబ్బంది ఉన్నారు.

# భాకరాపేటలో కిడ్నాప్ ముఠా అరెస్టు .. వెల్లడించిన ఎస్పీ సుబ్బారాయుడు



అమరావతి, జులై 29:తిరుపతి జిల్లా భాకరాపేటలో వ్యక్తి కిడ్నాప్ కేసును పోలీసులు చేధించారు. నకిలీ తుపాకీ చూపించి కిడ్నాప్ చేసి రూ.5 కోట్లు డిమాండు చేసిన నలుగురిని తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సోమవారం విలేకరులకు ఈ కేసు వివరాలను తెలిపారు. తిరుపతి జిల్లా, చిన్నగొట్టి గల్లు మండలం, చెరువు ముందరపల్లి గ్రామానికి చెందిన జంగం భాస్కర్ ను ఈ నెల 24–న ఉదయం 08:45 గంటలకు భాకరాపేట ఘాట్ రోడ్డు లో పెట్రోల్ బంకు సమీపంలో ఆటో లో వెళ్తుండగా నకిలీ తుపాకిని చూపి కిడ్నాప్ చేశారు. గొడవ చేస్తాడనే భయంతో అతడికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి కిడ్నాప్ చేసి, అక్కడక్కడ కారులో తిప్పారు.. భాదితుడి ఫోనుతో తన కుమారుడు రెడ్డి కిరణ్ కు ఫోను చేసి మొదట రూ. 5 కోట్లు డిమాండ్ చేశారు. అంత మొత్తం కుదరక పోవడంతో కోటిన్నర ఇవ్వాలని, లేదంటే జంగం భాస్కర్ ను చంపుతామని బెదిరించారు. భాదితుడి కుమారుడు రెడ్డి కిరణ్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పోలీసులకు చిక్కిన నిందితులపై బెంగుళూరు, రొంపిచెర్ల, భాకరాపేట, రాయచోటి లలో దొంగతనం, ఎర్రచందనం కేసులు ఉన్నాయి. భాధితుడిని కిడ్నాప్ చేయటానికి బాతుకోళ్ల మహమ్మద్ జీషాన్, అతని మిత్రులు మహమ్మద్ ఖాసిఫ్, ఆర్యం ఖాన్ సాయం చేశారు. భాదితుడు జంగం భాస్కర్ కదలికల కొరకు అతని ఊరికి చెందిన అంజి సహకారం తీసుకున్నారు. డాక్టర్ షేక్ జాహిద్ బాషా సహకారంతో మంతు ఇంజక్షన్ ఇప్పించారు. ఈ కిడ్నాప్ కోసం వినియోగించిన వాహనం, నకిలీ తుపాకిని, మత్తు ఇంజక్షన్, భాదితుడు జంగం భాస్కర్ ఆటో ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన నిందితుల కోసం గాలింపు బృందాలను ఏర్పాటు చేశారు.

# విజయమ్మతో జెసి ప్రభాకరరెడ్డి భేటి



అమరావతి, జులై 29:ఎపి రాజకీయాల్లో ఓ ఆసక్తికరమైన పరిణామం చోటు చేసుకుంది.. హైదరాబాద్ వెళ్లిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మను కలిశారు.. హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని విజయమ్మ నివాసానికి వెళ్లి భేటీ అయిన జేసీ ప్రభాకర్ రెడ్డి ఆమెతో అప్యాయంగా మాట్లాడారు.. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, వైఎస్ హయాంలో జేసీ ఫ్యామిలీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న విషయం విదితమే వైఎస్ కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు ప్రభాకరరెడ్డి సోదరుడు జేసీ దివాకర్‌రెడ్డి అయితే, వైఎస్ రెండో కేబినెట్‌లో జేసీ కుటుంబానికి మంత్రి పదవి దక్కలేదు.. దీంతో టిడిపి చేరిపోయారు.. తాజాగా విజయమ్మను కలువడం చర్చించనీయమైంది..

# కేంద్ర ప్రభుత్వం 100 రోజుల కార్యాచరణలో భాగంగా అనుబంధ/ అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలలో ఈ-ఆఫీస్ అమలు

న్యూఢిల్లీ, జులై 29 :2019-2024 సంవత్సరాలలో, కేంద్ర కార్యాలయంలో ఈ-ఆఫీస్ అమలు గణనీయమైన స్థాయికి చేరుకుంది. 37 లక్షల ఫైళ్లు అంటే 94 శాతం కంటే ఎక్కువ ఫైళ్లు, రసీదులు, ఈ-ఫైళ్లు, ఈ-రసీదులుగా ఎలక్ట్రానిక్‌గా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని మరింత లోతుగా పరిశీలించడానికి ప్రభుత్వం ఈ-ఆఫీస్ అనలిటిక్స్ (విశ్లేషణ)ను అభివృద్ధి చేసింది. కేంద్ర కార్యాలయంలో ఈ-ఆఫీస్ ప్లాట్‌ఫాం విజయవంతంగా అమలు చేయబడిన నేపథ్యంలో, అన్ని అనుబంధ, అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలలో ఈ-ఆఫీస్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్-మంత్రివర్గ సంప్రదింపుల తర్వాత 133 అనుబంధ, అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు అమలు కోసం గుర్తించబడ్డాయి. అనుబంధ, అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలలో ఈ-ఆఫీస్ అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను డి ఏ పి ఆర్ జీ 24 జూన్ 2024న జారీ చేసింది. ఆన్-బోర్డింగ్ దిశా నిర్దేశం, సాంకేతిక విధి విధానాలు అంతర్-మంత్రివర్గ సమావేశాలలో ఖరారు చేయబడ్డాయి.

రెండవ అంతర్-మంత్రివర్గ సంప్రదింపులు/ సమీక్ష సమావేశం 26 జూలై 2024న, డి ఏ పి ఆర్ జీ కార్యదర్శి శ్రీ వి. శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో ఎన్ ఐ సి, అన్ని మంత్రిత్వ శాఖలు/ విభాగాలు, అనుబంధ, అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 290 మందికి పైగా అధికారులు వీ సీ ద్వారా సమావేశానికి హాజరయ్యారు. 55 అనుబంధ/ అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు ఈ-ఆఫీస్ అమలు ప్రక్రియను ప్రారంభించాయి. అన్ని అనుబంధ/ అధీన కార్యాలయాలు, స్వయంప్రతిపత్తి సంస్థలు 31 జూలై 2024 నాటికి ఎన్ ఐ సి ఈ-ఆఫీస్ పి ఎం యూ కి అంచనా నమూనాలను సమర్పించాలని ఏకాభిప్రాయం కుదిరింది. అన్ని అనుబంధ/ అధీన/ స్వయంప్రతిపత్తి కార్యాలయాలలో ఈ-ఆఫీస్ విస్తరణ ప్రభుత్వ పరిపాలన సంస్కరణలు, ప్రజా పిటిషన్ల శాఖ 100 రోజుల కార్యాచరణ లో భాగంగా జరుగుతోంది.

# సభలో రేవంత్ తీరుపై హరీశ్ గరం గరం...

హైదరాబాద్, జులై 29: శాసనసభలో తప్పుడు ప్రకటనలతో అసెంబ్లీని కాంగ్రెస్ తప్పుదో పట్టిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, "గవర్నమెంట్ డిఫెన్స్‌లో పడినప్పుడు ఏదొక పేపర్ పట్టుకుని సభలోకి వచ్చి డైవర్షన్ చేస్తున్నారు. సభా నాయకుడు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. అదర్ దేన్ అగ్రికల్చర్ మీటర్స్ అనే పదాలను ఎగరగొట్టి చదివారు. అప్పులు 7 లక్షల కోట్లు అని తప్పుగా చెబుతున్నారు. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేయలేదని చెప్పే ప్రయత్నం నేను చేస్తుండగా మోటర్లకు మీటర్లు పెట్టడానికి సంతకం చేశారని రేవంత్ లేచి సభను మిస్ లీడ్ చేశారు." అని హరీశ్‌రావు మండిపడ్డారు.

"ఎల్ఆర్ఎస్ కోసం 25 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ? వాటిని క్లియర్ చేస్తే ఆదాయం వస్తుందని భట్టి చెబుతున్నారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. ఎల్ఆర్ఎస్‌పై కేసు విరమించుకుని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి కనీసం రాజీనామా కూడా చేయలేదు. నాడు కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు రిజైన్ చేస్తూ జీరాక్స్ కాపీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి కనీసం ఆ జీరాక్స్ కాపీ కూడా ఇవ్వలేదు." అని ఆరోపించారు.

"కేసీఆర్ ఆమరణ నిరహార దీక్ష చేయకుంటే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చేదా?, 2001 నుంచి 2014 వరకు తెలంగాణ గురించి రేవంత్ ఏ రోజు మాట్లాడలేదు. కేసీఆర్ చేసినన్ని రాజీనామాలు తెలుగు రాష్ట్రాల్లో ఎవరు చేయలేదు. అమరవీరుల ఆత్మ త్యాగాలను చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. 18 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఖాతా ఓపెన్ చేయలేదు. గత ఎన్నికల్లో పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. అంత మాత్రాన కాంగ్రెస్ పని అయిపోయిందని మేము ఆ రోజు అన్నామా!, ఇండియా కూటమి 28 పార్టీల కలయికతో ఆ సీట్లు వచ్చాయి. 28 పార్టీలతో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్‌కు 21 శాతం ఓట్లు వచ్చాయి. రేవంత్ పనితీరు బాగలేకపోవడంతోనే మహబూబ్‌నగర్ ఎంపీగా ఓడిపోయారు. ఆయన ఎంపీగా గెలిచిన మల్కాజిగిరి పార్లమెంట్‌లో కనీసం ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. రేవంత్ సొంత జిల్లాలో లోకల్ బాడి ఎమ్మెల్సీ స్థానం కూడా ఓడిపోయారు. 20 సీట్లు గెలిచినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 39 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాలేదా.. చీమలు పెట్టిన పుట్టలో పాము దురినట్లు కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారు. అసలు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీహెచ్ లాంటి నేతలు ఏమయ్యారు.., జైపాల్ రెడ్డి కనీసం రేవంత్ రెడ్డిని దగ్గరకు కూడా రానివ్వలేదు." అని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు.

# ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ని కలిసిన యువనేత



ఖమ్మం, జులై 29:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఊటుకూరి రంజిత్. పెద్దగోపతి గ్రామ పంచాయతీలోని పలు సమస్యలపై చర్చించి ముఖ్యంగా గ్రామపంచాయ తీకి లైబ్రరీ కావాలని చదువుకునే యువత చాలామంది ఉన్నారని, చదువుకోవటానికి ఖమ్మం పట్టణానికి వెళుతున్నారని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ని కోరిన ఊటుకూరి రంజిత్, సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

# "దేశంలో భయానక వాతావరణం నెలకొంది": రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ జులై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): బడ్జెట్ సెషన్ రెండో వారం సమావేశాలలో నేడు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర బడ్జెట్ 2024పై లోక్ సభలో మాట్లాడుతూ "దేశంలో భయానక వాతావరణం ఉంది" అన్నారు. అంతేకాక "దేశంలో పెద్ద పారిశ్రామిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించి గుత్తాధిపత్యం కట్టబెడుతున్నారు. ట్యాక్స్ టెర్రరిజం అంశాన్ని బడ్జెట్ అసలు స్పృశించనే లేదు. చిన్న వ్యాపారాలకు గడ్డు పరిస్థితులు సృష్టిస్తున్నారు. కమలం తాలూకు చక్రవ్యూహాన్ని రచించి భారత్ ను అందులో చిక్కుకునేలా చేశారు" అన్నారు.

# ఒలింపిక్స్‌లో పతకం గెలుచుకున్న మొదటి భారతీయ మహిళా షూటర్‌గా ఘనత

న్యూఢిల్లీ, జులై 29 :పారిస్ 2024 ఒలింపిక్స్‌లో జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో మను బాకర్ కాంస్య పతకాన్ని గెలుచుకొని చరిత్ర సృష్టించారు. పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత్‌కు ఇది మొదటి పతకం. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత షూటింగ్‌లో భారత్ అందుకున్న మొదటి ఒలింపిక్ మెడల్ కూడా ఇదే.

గత 20 ఏళ్లలో వ్యక్తిగత ఈవెంట్‌లో ఒలింపిక్స్ ఫైనల్ చేరిన మొదటి భారతీయ మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించిన మరుసటి రోజే ఒలింపిక్స్‌లో పతకం గెలిచిన మొదటి భారతీయ మహిళా షూటర్‌గా మను బాకర్ ఘనత సాధించారు.

ఒలింపిక్స్ ఆటల్లో పతకాన్ని సాధించిన ఐదో భారతీయ షూటర్‌గా మను బాకర్ నిలిచారు. ఇందుకు ముందు షూటింగ్‌లో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్(2004 ఏథెన్స్), అభినవ్ బింద్రా(2008 బీజింగ్), విజయ్ కుమార్(2012 లండన్), గగన్ నారంగ్(2012 లండన్) ఒలింపిక్స్ పతకాలు సాధించారు.

మను బాకర్ షూటింగ్ విభాగంలో పోటీ పడే భారత ఒలింపియన్. బాక్సర్లు, రెజ్లర్లకు ప్రాచుర్యం పొందిన రాష్ట్రమైన హర్యానాలోని ఝజ్జర్‌లో ఆమె జన్మించారు. పాఠశాలలో మను బాకర్ టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో పాల్గొనేవారు. 'తంగ్ త' అనే ఒక రకమైన యుద్ధ విద్యలోనూ ఆమె పాల్గొని జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు. 2016 రియో ఒలింపిక్స్ ముగిసిన తర్వాత ఆమె షూటింగ్ వైపు వెళ్లాలని నిర్ణయించుకొని, దీనినే ఇష్టపడ్డారు.

2017లో జరిగిన జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో మను బాకర్ తన ప్రదర్శనతో ఒలింపియన్, మాజీ ప్రపంచ నెంబర్ 1 హీనా సిధును ఆశ్చర్యపరిచి తొమ్మిది బంగారు పతకాలను గెలుచుకున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో 242.3 రికార్డు స్కోర్ సాధించి సిధును అధిగమించారు. షూటర్‌గా మను బాకర్‌కు 2018 విజయవంతమైన సంవత్సరం. ఆ ఏడాది జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో 16 ఏళ్ల వయస్సులోనే బంగారు పతకం సాధించి యువ సంచలనంగా ఆమె మారారు.

మెక్సికోలోని గ్వాడలజరలో 2018లో జరిగిన అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో గతంలో రెండుసార్లు చాంపియన్ అయిన మెక్సికోకు చెందిన అలెజాంద్ర జవాలాను మను బాకర్ ఓడించారు.

2019లో మునిచ్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో నాలుగో స్థానంలో నిలిచి ఒలింపిక్స్‌లో పోటీ పడే అవకాశాన్ని(కోటా ప్లేస్) మను బాకర్ ఖాయం చేసుకున్నారు. అయితే, ఆమె అరంగేట్రం మాత్రం అనుకున్నట్టు జరగలేదు. 2020 టోక్యో ఒలింపిక్స్ ముగిసిన వెంటనే లీమాలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మహిళా విభాగంలో మను బాకరన్ జూనియర్ ప్రపంచ చాంపియన్‌గా నిలిచారు. 2022లో జరిగిన కైరో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 25 మీటర్ల పిస్టల్ మహిళా విభాగంలో ఆమె రజత పతకాన్ని సాధించారు. హాంగ్జౌలో జరిగిన 2023 ఏషియన్ గేమ్స్‌లో ఇదే ఈవెంట్‌లో ఆమె బంగారు పతకాన్ని గెలుచుకున్నారు.

# కిడ్నీ రోగ బాధితునికి వెస్సో సహాయం

రంగారెడ్డి జిల్లా జూలై 29 (ఎస్ ప్రెస్ న్యూ స్ ):రంగారెడ్డి జిల్లా జిల్లెల గుడ దాసరి నారాయణ రావు కాలనీ నివాసి రాళ్ళబండి శ్రీకాంత్ చారి(24) స్థానిక ఆటోమొబైల్ వర్క్ షాప్ లో మెకానిక్ గా పని చేస్తున్నాడు. సంవత్సరం క్రితం అతనికి రెండు కిడ్నీలలో ఒకటి పాక్షికంగా, మరొకటి పూర్తిగా పాడైనట్లు వైద్య నిర్ధారణ జరిగింది. అప్పటి నుంచి వారానికి రెండు సార్లు హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రి లో డయాలసిస్ చేయించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు.ప్రాణాపాయం నుండి బయట పడాలంటే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవాలని ఉస్మానియా వైద్యులు సూచించారు. శ్రీకాంత్ చారికి కిడ్నీ దానం చేయడానికి ఆయన కన్న తల్లి ముందుకు వచ్చారు. వడ్రంగి వృత్తి లో ఉన్న శ్రీకాంత్ చారి తండ్రి ఈశ్వరాచారి కొడుకు చికిత్స నిమిత్తం ఇప్పటికే చాలా ఖర్చు చేశారు. ఆరోగ్యశ్రీ లో సర్జరీ జరుగు తున్నప్పటికీ మిగిలిన చికిత్స నిమిత్తం ఒక లక్ష రూపాయలు వరకు ఖర్చు అవుతుందని అంచనా! ఇందుకు ఈశ్వరాచారి వెస్సో సహాయము కోరారు. వెస్సో ట్రస్ట్ గౌరవ దాతల సహకారంతో రూ.53,100/- అందచేసింది.జూలై 27న ఎల్బీనగర్ బ్రహ్మంగారి గుడి ప్రాంగణంలో జరిగిన ఒక సేవా కార్యక్రమంలో గౌరవ దాతలు కొచ్చెర్ల సూర్య భాస్కరరావు, పోలోజు రవీంద్ర చారి, విశ్వంలో విలీనం సేవా ట్రస్ట్ సంస్థాపక అధ్యక్షులు పెంటా శ్రీనివాస చారి గార్ల చేతుల మీదుగా రూ. 53,100/- చెక్కు శ్రీకాంత్ చారి తల్లి శాంతమ్మ కు అంద జేశారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ విశ్రాంత డీజిఎం సూర్య భాస్కర రావు మాట్లాడుతూ స్థానిక నాయకులు సంఘీయుల అత్యంత న్యాయమైన సమస్యలను వెస్సో దృష్టి కి తీసుకొని వెళ్లడమే కాకుండా, వారి విరాళాల సేకరణలో కూడా తమ మండలం/ నియోజకవర్గం నుండి అత్యధికంగా దాతల విరాళాలు వెళ్లే విధంగా కృషి చేయాలని, అప్పుడే లబ్ధిదారునికి అవసర మైన పూర్తి సహాయం అందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సేవా కార్యక్రమం లో వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు, స్థానిక నాయకులు వెదురుపర్తి శ్రీమంగేష్, గొన్నాభక్తుల సత్యనారాయణ, రాయపల్లి కృష్ణ చారి, దొంతోజు ప్రభాకర చారి, ఫిరంగి స్వర్ణచారి, గన్నోజు చంద్రశేఖర ఆచారి, వల్లోజు బ్రహ్మచారి, అందోజు దయానంద చారి, చెన్నోజు యాదాచారి, ఎర్రోజు మల్లేష్ చారి, పులిమామిడి ఉపేంద్ర చారి, కాసోజు శ్రీధర చారి గార్లు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు

రంగా రెడ్డి జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);రాజేంద్రనగర్ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహించారు మహిళలు తల మీద బోనం ఎత్తి తొట్టెల ఊరేగింపుతో భాజా భజంత్రీల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు

# ప్రాణంపోయినా.. పది మందికి జీవనదానం

-బ్రయిన్ డెడ్ లో దీపిక
-ఆమె కుటుంబం అపురూప త్యాగం
-కుమార్తె అవయవదానం
-పది మందికి కొత్త జీవితం
-మేడ్చల్ లో ఘటన

హైదరాబాద్, జులై 29: ఈ జీవకోటిలో మనిషి పుట్టుక ఒక అద్భుతం. అన్ని జీవులలో అత్యంత తెలివైనవాడు మనిషి. ప్రతి ఒక్కరూ ఈ జన్మలో ఏదైనా గొప్పగా చేసి పదిమందికి గుర్తుండిపోయేలా చేయాలని కోరుకుంటారు. వ్యక్తి చనిపోయిన తర్వాత 200 అవయవాలను దానం చేసి పది మంది ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉజ్వల భవిష్యత్తు ఉన్న తమ కూతురు బ్రెయిన్ డెడ్‌తో హఠాత్తుగా మరణించడంతో తల్లిదండ్రులు ఆమె అవయవాలను దానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు. ఈఘటన మేడ్చల్ లో చోటుచేసుకుంది.

మేడ్చల్ పట్టణానికి చెందిన కూర శ్రీనివాస్, సరిత దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నాడు. రెండో కూతురు కూర దీపిక(16) నగరంలోని ఓ కళాశా లలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల22న ఇంటి నుంచి బయలుదేరే సమ యంలో వాంతులతో ఫిట్స్ వచ్చి ఇంట్లోనే కుప్పకూలింది. నగరంలోని యశోద ఆసుపత్రిలో చేర్పించారు. బాలికను పరీక్షించిన వైద్యులు అవయవాలు స్పందించడం లేదని వెంటిలేటర్ పై వైద్యం అందించారు. బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు తేల్చారు. ఆ తల్లి దండ్రులకు వచ్చిన ఆలోచనతో ఆసుపత్రి వర్గాలతో సంప్రదించి బాలిక అవయ వాలు దానం చేసేందుకు నిర్ణయించారు. దీంతో ఆ బాలిక అవయవాలతో పది మందికి ప్రాణం పోశారు. దీంతో ఆమె తల్లిదండ్రుల ఔదార్యానికి వైద్యులు అభినందించారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని అమరవీరుల స్థూపానికి వినతిపత్రం



ఖమ్మం, జులై 29:(నేటినిజం ప్రతినిధి): అసెంబ్లీ సమావేశంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని అమరవీరుల స్థూపానికి వినతి పత్రం ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు, ఖమ్మం మంత్రులు పొంగులేటి, తుమ్మలకు తెలంగాణ ఉద్యమకారులు విన్నవించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ...అసెంబ్లీ ఎన్నికల సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పొందుపరచిన విధంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీల మీద స్పష్టమైన ప్రకటన చేశారు కానీ ఉద్యమకారులకు మీరు ఇచ్చిన హామీలు ముఖ్యంగా 250చదరపు గజాలు, ఇంటి నిర్మాణం కోరకు 10లక్షల రూపాయల హామీలు వచ్చే డిసెంబర్ 9సోనియా గాంధి పుట్టినరోజు నాటికి పూర్తిస్థాయి అమలలో తెస్తారని ఆశాభవం వ్యక్తం చేశారు. అదేవిదంగా ఉద్యమకారులకు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఉద్యమకారులు కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల కష్ట ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ పెద్దలే పరోక్షంగా అనేక అవమానాలకు గురిచేసింది. కానీ అసెంబ్లీ ఎన్నికలు సంధర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో చూసి మాకు మా జీవితాల మీద ఆశలు చిగురించాయి అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అయినా ఉద్యమకారులకు గుర్తింపు వస్తుందనే నమ్మకం కలిగిందన్నారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు, ఉద్యమకారు లు బొమ్మెర రాంమూర్తి, పగడాల నరేందర్, లింగబోయిన సతీష్, బచ్చల పద్మచారి, పెళ్లూరి విజయ్ కుమార్, బోడా వీరన్న, భూక్యా రాంబాబు నాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, ఎస్డి బురాన్, ఎస్.కె అబ్బాస్ అలి, ఎండి.ఆసీఫ్ అలి, అవుల నాగేశ్వరరావు, చెరుకువల్లి నాగేశ్వరరావు, పొనుకోల కోటేశ్ యాదవ్, ఎండీ.వసిం ఖాన్, బాలిన భాస్కర్ రెడ్డి, వీరబాబు, మహిళా ఉద్యమ కారుణిల జిల్లా అధ్యక్షురాలు రెడ్డిబొయిన వరలక్మి, అనంత లక్మీ, నల్ల స్వరూపరాణి, యలమూరి ధనలక్మి, రఘానా విక్టోరియా, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# అబ్దుల్ కలాం జీవితం యువతకు ప్రేరణాత్మకం

**- బి వి గోపాల్ రెడ్డి, వాగేశ్వరీ డిగ్రీ పిజీ కళాశాల చైర్మన్**




హైదరాబాద్, జులై 29: ప్రపంచ యువతకు నిత్య ప్రేరణగా నిలిచిన ఏ పి జె అబ్దుల్ కలాం జీవితం దారి దీపంగా సన్మార్గాన్ని చూపిస్తున్నదని వాగేశ్వరీ డిగ్రీ పిజీ కళాశాల, కరీంగర్ చైర్మన్ బి వి గోపాల్ రెడ్డి అన్నారు. ఈ రోజు కరీంనగర్ లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ నిర్వహించిన ఏ పి జె అబ్దుల్ కలాం వర్ధంతి సమావేశంలో చిత్ర పటానికి పూల మాలతో నివాళులు అర్పించి ముఖ్య అతిధి సందేశమిస్తూ నేటి కళాశాల యువత కలాం బోధనలను జీర్ణించుకొని సత్రౌరులుగా ఎదిగి, దేశాభివృద్ధిలో భాగం కావాలని సూచించారు. వాగేశ్వరీ విద్యాసంస్థల్లో లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ శాఖలను ప్రారంభిస్తామని కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు.

సభాధ్యక్షులు లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ భారత రత్న, క్షిపణి పితామహుడు, ప్రజా రాష్ట్రపతి, ఉపాధ్యాయుడు అయిన ఏ పి జె అబ్దుల్ కలాం జీవితమంతా జాతికి అంకితం చేశారని తెలిపారు. ఉన్నత కలలు కంటూ, వాటి సాకారానికి కృషి చేస్తూ, తాము ఎదిగి ప్రపంచాభివృద్ధికి దోహదపడే స్థాయికి చేరడమే ఏకైక మార్గమని నమ్మిన కలాం మేధలో జనించిన లీడ్ ఇండియా యువ ఉద్యమం మరింత వేగంగా విస్తరించవలసిన అవసరం ఉందని అన్నారు. జిల్లాలోని ప్రముఖ కళాశాలల్లో లీడ్ ఇండియా శాఖలను విస్తరిస్తున్నామని తెలిపారు.

లీడ్ ఇండియా ఉద్యమ ముఖ్య నలహాదారు సింగమ రాజు మాట్లాడుతూ పేదరికాన్ని జయించి రామేశ్వరం వీధుల నుంచి ఎదిగి రాష్ట్రపతి భవన్ వరకు చేరిన అబ్దుల్ కలాం అనుభవాలు, అభిప్రాయాలను యువభారతం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా కరీంనగర్ కార్యదర్శి డా సంకోజు మనోహరాచారి వందన సమర్పణ చేయగా, క్లబ్ క్రియాశీల సభ్యులు కోమల్ల రాజెందర్ రెడ్డి, వాగేశ్వరీ కళాశాల బాధ్యులు నరేందర్ రెడ్డి, చైతన్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొని అబ్దుల్ కలాంకు ఘన నివాళులు అర్పించారు.

# ప్రతిష్టాత్మకమైన "జీవిత సాఫల్య పురస్కారం" అందుకున్న కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్.

న్యూఢిల్లీ, జులై 29 :దేశ, దేశాలకు చెందిన వైద్యరంగ ప్రముఖులు, నిపుణులు, మెడికోల అంతర్జాతీయ సమావేశ సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో, డయాబెటాలజీ, మధుమేహ సంరక్షణ, మధుమేహ పరిశోధనల పురోగతిలో తన ఆదర్శప్రాయమైన అంకితభావంతో దేశ, విదేశాలలో గుర్తింపు పొందిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రతిష్టాత్మక ''జీవిత సాఫల్య పురస్కారం'' అందుకున్నారు.

చెన్నైలోని డాక్టర్ మోహన్స్ డయాబెటిస్ స్పెషాలిటీ సెంటర్, మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్‌ల చైర్మన్ డాక్టర్ వి. మోహన్ ప్రశంసాపత్రాన్ని చదువుతూ, డాక్టర్ జితేంద్ర సింగ్ కింది స్థాయి నుండి కష్టపడి క్రమంగా డయాబెటాలజీలో అధ్యాపక ఆచార్యులు, పరిశోధకులు మరియు ప్రాక్టీషనర్‌గా పేరు గడించి తన రాష్ట్రానికి, దేశానికి సైతం గొప్ప పేరు తెచ్చారన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి. సి. రాయ్ లాగా, డాక్టర్ జితేంద్ర సింగ్ కూడా జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన అతి తక్కువమంది వైద్య నిపుణులలో ఒకరు, అంతేగాక వారు విశేష జనాదరణతో వరుసగా మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికవడమే కాకుండా కేంద్ర మంత్రి మండలిలో వరుసగా మూడు పర్యాయాలు బెర్త్ దక్కించుకున్న దేశంలోని అతి కొద్ది మందిలో అలాగే జమ్మూ ఉ కాశ్మీర్ నుండి ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా ఘనత సాధించారు. తన నిజాయితీ, నిష్కళంకమైన వ్యక్తిత్వంతో పేరుగాంచిన డాక్టర్ జితేంద్ర సింగ్ మూడు పర్యాయాలలో తనతో కలిసి పనిచేసిన సహచరుల గౌరవాభిమానాలను పొందారు అని ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు.

డయాబెటాలజిస్టుల అతిపెద్ద విద్యాసంబంధ సంఘం అయిన ఆర్.ఎస్.ఎస్.డి.ఐ. (భారతదేశంలో మధుమేహం అధ్యయనం కోసం గల పరిశోధనా సంస్థ) యొక్క జీవిత సాఫల్య పురస్కారం ద్వారా డాక్టర్ జితేంద్ర సింగ్‌కు ప్రత్యేక గుర్తింపు లభించినట్లు ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో భాగంగా చదివి వినిపించిన ప్రశంసా పత్రంలో డాక్టర్ జితేంద్ర సింగ్‌ను ఒక బహుముఖ ప్రజ్ఞాశాలిగా, అద్భుతమైన విద్యావేత్తగా, పరిశోధకునిగా, వైద్య అధ్యాపకునిగా, రచయితగా అభివర్ణించారు. గతంలో ఆయన అందుకున్న అవార్డులలో పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ ఉ రీసెర్చ్ (జిప్‌మర్) అందించిన "గోల్డ్ మెడల్ ఫర్ ఒరేషన్" అలాగే జర్నలిజం రంగంలో ప్రతిష్టాత్మకమైన "జమ్నా దేవి గియాన్ దేవి అవార్డు" సహా పలు అవార్డులు ఉన్నాయి.

డయాబెటిస్‌కు సంబంధించిన వివిధ అంశాలపై డాక్టర్ జితేంద్ర సింగ్ ఎనిమిది పుస్తకాలు, మూడు మోనోగ్రాఫ్‌లను రచించినట్లు ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. వైద్యశాస్త్రం యొక్క ప్రముఖ పాఠ్యపుస్తకాలలో ఆయన మధుమేహంపై వ్రాసిన అధ్యాయాలు చేర్చబడినవి, మంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన ప్రతిష్టాత్మక "ఏ.పీ.ఐ. టెక్స్ట్‌బుక్ ఆఫ్ మెడిసిన్" యొక్క పన్నెండు వరుస సంచికలలో డయాబెటిస్‌పై ఆయన ఒక అధ్యాయాన్ని వ్రాశారు. డయాబెటిస్ పట్ల అవగాహన గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ వ్రాసిన పుస్తకాలలో ఒకటి అయిన "డయాబెటిస్ మేడ్ ఈజీ" న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించిన ప్రపంచ పుస్తక ప్రదర్శనలో బెస్ట్ సెల్లర్ విభాగంలో స్థానం సంపాదించిన విషయాలను ప్రస్తావించారు.

"స్టైన్ డయాబెటిస్ ఇన్ కశ్మీరీ మైగ్రాంట్స్" గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ వ్రాసిన మార్గదర్శకమైన రచన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ.) ప్రశంసలను అందుకుంది. "గర్భధారణలో మధుమేహం నిర్వహణ కోసం మార్గదర్శకాలు" ఖరారు చేసిన డి.ఐ.పి.ఎన్.వై పరిశోధనా బృందంలో ఆయన సభ్యులుగా ఉన్నారు అలాగే ఈ మార్గదర్శకాలు రిఫెరల్ కోసం డబ్ల్యు.హెచ్.ఓ. ఆమోదం పొందినవి. వైద్యశాస్త్ర, డయాబెటిస్ అధ్యాపకులుగా డాక్టర్ జితేంద్ర సింగ్ దాదాపు రెండు డజన్ల మంది పరిశోధన విద్యార్థులకు గైడ్‌గా మార్గదర్శనం చేశారు.

పార్లమెంటేరియన్‌గా, భారత ప్రభుత్వంలో మంత్రిగా డాక్టర్ జితేంద్ర సింగ్ సేవలను కూడా ఈ ప్రశంసాపత్రంలో ప్రస్తావించారు అలాగే పార్లమెంట్‌లో అతని అద్భుతమైన చర్చలు, ప్రజెంటేషన్‌లను కూడా ప్రశంసించారు. భారత ప్రభుత్వంలో తన ఆధ్వర్యంలోని అనేక విభాగాలు, మంత్రిత్వ శాఖలను డాక్టర్ జితేంద్ర సింగ్ అద్భుతంగా నిర్వహించారని ప్రశంసించారు. ఆయన కృషి, గొప్ప దృక్పథం, అణకువగా ఉండే వ్యక్తిత్వంతో సమాజంలోని అన్ని వర్గాల మెప్పు పొందినట్లు ప్రశంసాపత్రం పేర్కొంది. ఆయన యొక్క నిరాడంబరమైన స్వభావం, ఆచరణాత్మక, మానవీయ విధానం, మాటల్లో అలాగే చేతలలో, డాక్టర్ జితేంద్ర సింగ్‌ను భారతదేశం యొక్క "నిజమైన బిడ్డ"గా మార్చినట్లు అభివర్ణించారు.

ప్రశంసాపత్రాన్ని చదవడం పూర్తయిన వెంటనే, డాక్టర్ జితేంద్ర సింగ్‌కు "జీవిత సాఫల్య పురస్కార" బంగారు పతకాన్ని అందిస్తుండగా, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రేక్షకులందరూ ఆయన పట్ల గౌరవ సూచకంగా నిలబడి కొన్ని నిమిషాల పాటు చప్పట్లు కొడుతూ తమ గౌరవాన్ని వ్యక్తపరిచారు. డాక్టర్ జితేంద్ర సింగ్ విద్యాభ్యాసం చెన్నైలో జరిగిందని అలాగే ఆయన ప్రతిష్టాత్మక స్టాన్లీ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి అని కార్యక్రమ నిర్వాహకులు ప్రకటిస్తున్న సమయంలోనూ ప్రేక్షకులు ఉత్సాహంతో చప్పట్లు కొడుతూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.

తనకోసం లేచి నిలబడి చప్పట్లు కొడుతూ ప్రశంసలందిస్తున్న ప్రేక్షకుల స్పందనకు తల వంచి నమస్కరించి, ధన్యవాదాలు తెలిపిన డాక్టర్ జితేంద్ర సింగ్, అవార్డును స్వీకరించిన సందర్భంగా "అంగీకార ప్రసంగం" చేస్తూ, ఈ అవార్డు తనకు చాలా పెద్దదని, తన మనసు ఆదేశం మేరకు అత్యంత నిరాడంబరత, వినయంతో మాత్రమే దీనిని స్వీకరించగలనని చెప్పారు. దాదాపు నాలుగు దశాబ్దాల ప్రయాణంలో దేశంలోని అత్యున్నత వైద్య నిపుణుల మార్గదర్శనంలో ఎదగడం, ప్రముఖ వైద్యులైన ఎందరో సీనియర్స్, సహోద్యోగుల సహచర్యం పొందడం దైవానుగ్రహమేనని అన్నారు.

# ముస్సోరి, ఢిల్లీలో 2 వారాల కార్యక్రమంలో పాల్గొన్న వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన 45 మంది బంగ్లాదేశ్ సివిల్ సర్వీస్ అధికారులు

న్యూఢిల్లీ, జులై 29 :విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో బంగ్లాదేశ్ సివిల్ సర్వెంట్ల కోసం జాతీయ సుపరిపాలన కేంద్రం నిర్వహించిన రెండు వారాల 72వ సామర్థ్య నిర్మాణ కార్యక్రమం న్యూఢిల్లీలో ముగిసింది. అడిషనల్ డిప్యూటీ కమిషనర్లు, సీనియర్ అసిస్టెంట్ కమిషనర్లు, రెవెన్యూ డిప్యూటీ కమిషనర్లు, ఉపాజిల్లా అధికారులుగా పనిచేస్తున్న 45 మంది అధికారులు హాజరైన ఈ కార్యక్రమం 2024 జూలై 15 నుంచి 26 వరకు ముస్సోరీ, న్యూఢిల్లీలో జరిగింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో బంగ్లాదేశ్, కెన్యా, టాంజానియా, ట్యునీషియా, సీషెల్స్, గాంబియా, మాల్దీవులు, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, లావోస్, వియత్నాం, నేపాల్, భూటాన్, మయన్మార్, ఇథియోపియా, ఎరిత్రియా, కంబోడియా సహా 17 దేశాల సివిల్ సర్వెంట్లకు జాతీయ సుపరిపాలన కేంద్రం శిక్షణ ఇచ్చింది.

ముగింపు సమావేశంలో ఎన్సీజీజీ డైరెక్టర్ జనరల్, పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్పీజీ) కార్యదర్శి వి.శ్రీనివాస్ ప్రసంగించారు. శ్రీ వి.శ్రీనివాస్ తన ముగింపు ప్రసంగంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య అభివృద్ధి భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. బంగ్లాదేశ్ సివిల్ సర్వీస్ అధికారులకు కొత్త పాలన నమూనాలు, కార్యక్రమాలపై ఈ సామర్థ్య నిర్మాణం సాధికారత కల్పించింది. 2014 నుంచి 2024 వరకు విదేశీ మంత్రిత్వ శాఖ తోడ్పాటుతో, ఢాకాలోని భారత రాయబార కార్యాలయంతో సహకారంతో 2700 మంది బంగ్లాదేశీ సివిల్ సర్వెంట్లకు ఎన్సీజీజీ సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించింది.

ముగింపు సభ సందర్భంగా, కార్యక్రమంలో పాల్గొన్న నాలుగు బృందాలు నాలుగు కీలక అంశాలపై ప్రదర్శన ఇచ్చాయి. అవి: బంగ్లాదేశ్ లో సార్వత్రిక పింఛను పథకం, ప్రధాని పది ప్రత్యేక కార్యక్రమాలు, సుపరిపాలన కోసం ఐదు సాధనాలు, స్మార్ట్ బంగ్లాదేశ్: శ్రేయస్సుకు మార్గం. కోర్సు సమన్వయకర్త, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎ.పి. సింగ్ తన స్వాగతోపన్యాసంలో రెండు వారాల ఈ కార్యక్రమ అవలోకనాన్ని అందించారు. బంగ్లాదేశ్‌లోని మిడ్ కెరీర్ ఆఫీసర్‌ల కోసం రెండు దేశాల పాలన నమూనాలు, అనుభవాల వినిమయం కోసం ఈ కార్యక్రమం విలువైన వేదికను అందించిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఎన్సీజీజీ సామర్థ్య నిర్మాణ బృందంతో కలిసి కోర్సు సమన్వయకర్త, అసోసియేట్ ప్రొఫెసర్ డా. ఎ.పి. సింగ్; కోర్సు సహ సమన్వయకర్త డా. ముఖేశ్ భండారి; ప్రోగ్రామ్ అసిస్టెంట్ శ్రీ బ్రిజేశ్ గుప్త మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎన్సీజీజీ సీఈవో శ్రీమతి ప్రిస్కా పోలీ మాథ్యూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జీఎస్టీ కుంభకోణం.. మాజీ సి ఎస్ సోమేష్ కుమార్ పై కేసు నమోదు



హైదరాబాద్, జులై 29: జీఎస్టీ కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్‌ను పోలీసులు 5వ నిందితుడిగా చేర్చారు.

ఈ మేరకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పన్ను ఎగవేతదార్లకు సహకరించడంతో వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయంటూ ఆ శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదయిన విషయం తెలిసిందే. వాణిజ్య పన్నుల శాఖ అడిషనల్ కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వర రావు, డిప్యూటీ కమిషనర్(హైదరాబాద్ రూరల్) శివ రామప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ఇప్పటికే ఈ కేసులో నిందితులుగా చేర్చారు.

కాగా వాణిజ్య పన్నుల శాఖలో పెద్ద ఎత్తున పన్ను ఎగవేతలు జరిగినట్టుగా సమాచారం. ఒక్క తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ ఎగవేత ద్వారా ఏకంగా రూ.1,000 కోట్లకుపైగా నష్టం జరిగినట్టు తెలుస్తోంది. మరో 11 ప్రైవేటు సంస్థలు దాదాపు రూ. 400కోట్లు పన్ను చెల్లింపులు ఎగవేసినట్టు ఆ శాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఫిర్యాదులో తెలిపారు.

మరోవైపు మానవ వనరులను అందించే 'బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఏమాత్రం టాక్స్ కట్టకుండానే ఏకంగా రూ.25.51కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుందని, అవకతవకలు జరిగాయని తేలిన నేపథ్యంలో అంతర్గతంగా విచారణ జరిపినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాణిజ్యపన్నులశాఖకు సాంకేతికతను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఐఐటీ హైదరాబాద్ వ్యవహరించింది. తెలంగాణలో పన్ను చెల్లింపుదారులు నమోదు చేసే ఐటీ రిటర్న్‌ల్లో అక్రమాలను గుర్తించడంతో పాటు డేటాను విశ్లేషించడం సర్వీస్‌ప్రొవైడర్ చేయాల్సిన పని. పన్నుచెల్లింపుదారుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన 'స్క్రూటినీ మాడ్యూల్' గుర్తించాల్సి ఉంటుంది. కానీ బిగ్‌లీప్ టెక్నాలజీస్ అక్రమాలను ఐఐటీ హైదరాబాద్ అందిస్తున్న ఐఐటీ హైదరాబాద్ 'స్క్రూటినీ మాడ్యూల్' కూడా గుర్తించలేకపోయిందని వివరించారు

# వికసిత భారత్-2047పై గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ స్వప్నం నెరవేర్చగల చరిత్రాత్మక బడ్జెట్ ఇది: డాక్టర్ ఎల్.మురుగన్

న్యూఢిల్లీ, జులై 29 : కేంద్ర ప్రభుత్వం జూలై నెల 23న సమర్పించిన కేంద్ర బడ్జెట్ 2024-25 చరిత్రాత్మకమైనదని కేంద్ర సమాచార-ప్రసార; సభా వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ అన్నారు. దేశాన్ని 2047 నాటికి 'వికసిత భారత్'గా రూపొందించాలన్న గౌరవనీయ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ స్వప్న సాకారం లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందిందని ఆయన పేర్కొన్నారు.

ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌పై శనివారం (2024 జూలై 27) ఆయన విజయవాడలో పత్రికా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రధానిగా మూడోసారి శ్రీ నరేంద్ర మోదీ సాధించిన రికార్డు విజయంతో ఈ కల నెరవేరడం తథ్యమని ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు.

అటు కేంద్రంలో, ఇటు ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) అధికారంలోకి వచ్చినందువల్ల రాష్ట్రంలో ప్రగతి ద్వంద్వచోదక శక్తితో పరుగులు పెడుతుందని ఆయన అన్నారు.

మన దేశం 2023-24లో జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి) పరంగా 8.2 శాతం వృద్ధి సాధించిందని ఆయన గుర్తుచేశారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ రాబోయే రెండేళ్లలో కొత్త ప్రభుత్వం రాష్ట్రాన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) గమ్యంగా మార్చుకోగలదన్నారు. అలాగే భారతదేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా చేపట్టిన సంస్కరణలను కొనసాగించగలదని పేర్కొన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆదాయం పెంచుకునేలా 'ఎఫ్‌డిఐ' నియమనిబంధనాలు, విధానాలు సరళీకృతం చేసినట్లు తెలిపారు.

సాంఘిక సంక్షేమ రంగానికి గత బడ్జెట్‌లో కేటాయింపులు రూ.11 లక్షల కోట్లు కాగా, ఈసారి రూ.23 లక్షల కోట్లకు పెంచినట్లు మంత్రి గుర్తుచేశారు. ఈ రంగంలో చేపట్టే కార్యక్రమాల ప్రభావంపై పర్యవేక్షణ కోసం అమలు-ఫలితాలపై దృష్టి సారించే చట్రానికి ఈ బడ్జెట్ ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు.

'పిఎం-ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల కార్యక్రమం', 'ప్రధానమంత్రి జనారోగ్య యోజన' సహా మానసిక ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలకు బడ్జెట్ కేటాయింపులు గణనీయంగా పెరిగినందువల్ల ఆరోగ్య సంరక్షణ రంగం మరింత మెరుగుపడుతుందని డాక్టర్ మురుగన్ అన్నారు.

అలాగే 'పిఎం విశ్వకర్మ, పిఎం స్వానిధి, జాతీయ జీవనోపాధి కార్యక్రమాలు, స్టాండప్ ఇండియా' వంటి ఇతర కార్యక్రమాలకూ బడ్జెట్ మరింత ఉత్తేజమిస్తుందని చెప్పారు. అంతేకాకుండా హస్తకళాకారులు, చేతివృత్తులవారు, స్వయం సహాయ బృందాలు, ఎస్సీ/ఎస్టీలు, మహిళా పారిశ్రామికవేత్తలు, వీధి వర్తకులు తదితర వర్గాలకు సాధికారత లభిస్తుందని, ఉద్యోగ సృష్టితోపాటు స్థానికంగా ఆర్థిక వ్యవస్థల వృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.

మౌలిక సదుపాయాలు, బోధనాభ్యసన వనరులు, పోషకాహార మద్దతు సంబంధిత ప్రధాన పథకాలకు సమగ్ర శిక్ష అభియాన్, పిఎం-పోషణ్, పిఎం-శ్రీ వంటి వాటిద్వారా బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని మంత్రి వివరించారు.

ఆరోగ్య రంగానికీ కేటాయింపులు రూ.2.5 లక్షల కోట్ల నుంచి రెట్టింపు పెరుగుదలతో రూ.5.85 లక్షల కోట్లకు చేరాయని ఆయన పేర్కొన్నారు. గత సంవత్సరపు కేటాయింపుతో పోలిస్తే ఈసారి కేటాయింపులు 13 శాతం పెరిగాయని తెలిపారు. దేశం ఆరోగ్య సంరక్షణ రంగం బలోపేతంపై ప్రభుత్వ నిర్విరామ నిబద్ధతకు నిదర్శనమని మంత్రి చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చినట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

దేశవ్యాప్తంగా రాబోయే రెండేళ్లలో ప్రకృతి వ్యవసాయం దిశగా కోటి మంది రైతులను ప్రోత్సహించనున్నట్లు డాక్టర్ మురుగన్ తెలిపారు. ఈ కృషిలో భాగంగా వారికి ధ్రువీకరణ, బ్రాండింగ్ మద్దతు లభిస్తుందని తెలిపారు. అలాగే ఈ ఏడాది వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించిన నేపథ్యంలో దేశమంతటా 10,000 దాకా అవసరాధారిత జీవ-ఉత్పాదక వనరుల కేంద్రాలు ఏర్పాటవుతాయని చెప్పారు.

పప్పుదినుసులు, నూనెగింజల పరంగా స్వావలంబన లక్ష్యంగా వాటి ఉత్పాదన, నిల్వ, మార్కెటింగ్‌లను ప్రభుత్వం బలోపేతం చేయనుందని తెలిపారు. అలాగే ఆవాలు, వేరుసెనగ, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల విషయంలో 'స్వయం సమృద్ధి' సాధనకూ చర్యలు చేపట్టిందని చెప్పారు. దేశంలోని రైతులతోపాటు వారి భూ కమతాలకు వర్తించే విధంగా రాష్ట్రాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల సౌలభ్యం కల్పిస్తుందని వెల్లడించారు.

ఉత్పాదకత పెంపుపై దృష్టి సారిస్తూ వ్యవసాయ పరిశోధన వ్యవస్థపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేపట్టనుందని మంత్రి తెలిపారు. అలాగే 32 రకాల సాధారణ- ఉద్యాన పంటల సాగుకు సంబంధించి 109 అధిక-దిగుబడి, వాతావరణ ప్రతిరోధక వంగడాలను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు.

తూర్పు భారత ప్రాంత సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా 'పూర్వోదయ' ప్రణాళికను రూపొందిస్తున్నట్లు డాక్టర్ మురుగన్ తెలిపారు. ఈ ప్రణాళిక కింద ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాల్లో మానవ వనరుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అవకాశాల సృష్టి తదితర అంశాలపై ఈ ప్రణాళిక దృష్టి సారిస్తుందని చెప్పారు. తద్వారా వికసిత భారత్ లక్ష్య సాధనలో తూర్పు భారతం ఒక చోదకంగా రూపొందగలదన్నారు.

ముద్ర రుణాల గురించి మాట్లాడుతూ- ఈ పథకం కింద పొందిన రుణాన్ని సకాలంలో చెల్లించిన పారిశ్రామికులకు మళ్లీ రుణ మంజూరు పరిమితిని కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచిందని మంత్రి వివరించారు.

ప్రభుత్వ నేతృత్వంలో వృద్ధి లక్ష్యంగా తయారీ, సేవారంగాల పరిశ్రమల బలోపేతం సహా, 'ఎంఎస్ఎంఇ'లకు చేయూతలో భాగంగా యంత్రాల కొనుగోలుకు రూ.100 కోట్లదాకా పూచీకత్తు లేని రుణం కచ్చితంగా లభిస్తుందని మంత్రి చెప్పారు. రుణ గ్రహీతలపై ఒత్తిడి తగ్గింపు, ఆర్థిక స్థిరత్వం దిశగా టర్నోవర్ పరిమితిని రూ.500 కోట్ల నుంచి రూ.250 కోట్లకు తగ్గించినట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత బడ్జెట్ 2024-25లో నైపుణ్య కల్పనపై ప్రకటనను ప్రస్తావిస్తూ- ప్రధానమంత్రి ప్యాకేజీ కింద 4వ పథకంగా కొత్త కేంద్ర ప్రాయోజిత పథకాన్ని ప్రకటించినట్లు మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల సహకారంతో అమలు చేసే ఈ పథకం కింద రాబోయే ఐదేళ్లలో సుమారు 20 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. ఈ మేరకు సత్ఫలితాల సాధన లక్ష్యంగా 1,000 పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటిఐ)ను కూడలి-సంస్థ విధానం ఉన్నతీకరిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు, విధానాల కింద ఎలాంటి ప్రయోజనానికీ అర్హతలేని యువతకు చేయూతగా దేశీయ విద్యా సంస్థలలో ఉన్నత చదువుల కోసం రూ.10 లక్షల వంతున రుణం లభిస్తుందని మంత్రి తెలిపారు.

దేశవ్యాప్తంగా 'పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' కింద కోటి కుటుంబాలు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పొందటానికి వీలుగా వారి ఇళ్ల పైకప్పుమీద సౌర శక్తి యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ మురుగన్ తెలిపారు. ఈ పథకానికి నేడు విశేష స్పందన లభిస్తున్నదని ఆయన అన్నారు.

ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) 4వ దశకింద జనాభా పెరుగుదల ప్రాతిపదికన దేశంలోని 25,000 గ్రామీణ ఆవాసాలకు అన్ని వాతావరణాలకు తగిన రహదారి అనుసంధానం కల్పిస్తామని తెలిపారు.

ఈసారి కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 'ప్రత్యేక కేటాయింపులు' చేసినట్లు డాక్టర్ మురుగన్ చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్, పారిశ్రామిక కారిడార్లు తదితరాలపై "హామీల" మేరకు ఐదేళ్ల తర్వాత ఈ వేరకు ప్రకటించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుకు అదనపు నిధులు, విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్ కోసం నిధులతోపాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిధిలోనివి సహా ప్రకాశం జిల్లాను కూడా ప్రత్యేకంగా చేర్చిన నేపథ్యంలో మొత్తం 7 వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. బహుపాక్షిక సంస్థల ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ "ప్రత్యేక ఆర్థిక సహాయం" సౌలభ్యం కల్పిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, రైతులకు జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టుకు ఆర్థిక సహాయంతోపాటు సత్వర పూర్తికి కేంద్రం "పూర్తిస్థాయిలో కట్టుబడి ఉంది" అని మంత్రి పునరుద్ఘాటించారు.

# డ్రాగా ముగిసిన భారత్ అర్జెంటీనా మ్యాచ్

న్యూఢిల్లీ, జులై 29 :ప్యారిస్ ఒలింపిక్స్ లో భాగంగా నేడు జరిగాన భారత హాకీ పురుషుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. పూల్-బి లో ని రెండో మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు ? పటిష్టమైన అర్జెంటీనాతో తలపడగా మ్యాచ్‌ను 1-1 స్కోర్‌తో డ్రాగా ముగించింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి అర్ధభాగంలోనే అర్జెంటీనా ఆటగాడు లూకాస్ మార్టినెజ్ 22వ నిమిషంలో గోల్ చేసి ఆ జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు.

ఈ మ్యాచ్ లో ఆఖరి నిమిషం వరకు భారత జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. అయితే, చివరి 59వ నిమిషంలో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. దీంతో చివరి నిమిషంలో భారత జట్టు గోల్ చేసి 1-1తో మ్యాచ్‌ను ముగించింది. ఈ మ్యాచ్ తర్వాత భారత్ జట్టు 4 పాయింట్లతో గ్రూప్-బిలో మూడో స్థానంలో ఉంది.

భారత జట్టు తన తదుపరి మ్యాచ్‌లో రేపు ఐర్లాండ్‌తో తలపడనుండగా? ఆగస్టు 1న బెల్జియంతో, ఆగస్టు 2న ఆస్ట్రేలియాతో తలపడనుంది.

# హైదరాబాద్ లో ఈ నెల 30న నీటి సరఫరాకు అంతరాయం..

హైదరాబాద్, జులై 29: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 30వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 31వ తేదీ ఉదయం 6 గంటల వరకు మంజీరా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జలమండలి ప్రకటించింది. పటాన్‌చెరు జంక్షన్ పనుల వల్ల నగరంలోని పలు ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది. మరమ్మతు పనుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా తాగునీటి సరఫరా నిలిచిపోనుంది.

బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, పటాన్‌చెరు ఇండస్ట్రియల్ ఏరియా, పటాన్‌చెరు టౌన్, రామచంద్రాపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్‌పేట, డోయెన్స్ కాలనీ, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్ ప్రాంతాలకు మంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి తెలిపింది.

కాగా, వాటర్ పైప్ లైన్ మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, ప్రజలు సహకరించాలని హైదరాబాద్ జలమండలి కోరింది. ఈ నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

# పగిడేరులో వృద్ధ దంపతులు ఆత్మహత్య

ఖమ్మం, జులై 29::మండల పరిధిలోని పగిడేరు పంచాయతీలో ఎస్టీ కాలనీలో నివాసముంటున్న కాసరబాదా రామచంద్రయ్య(75), సరోజినమ్మ(69), అనే వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు.

పాల్పడ్డిన ఘటన ఆదివారం రాత్రి గ్రామ సమీపంలోని, వ్యవసాయ పొలాల్లో బావిలో దూకి ఆత్మహత్యకు ఘటన చోటు చేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధ దంపతుల్లో సరోజినమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు. స్థానికులు నాటు వేసి తిరుగు వేసి వస్తున్న క్రమంలో,పోలాల మధ్య ఉన్న బాయి వైపు చూడగా,సరోజిని మృత దేహం పైకి తేలుతూ ఉండగా,ఈ విషయాన్ని గ్రామస్థుల కు చేరవేశారు .ఈ ఘటన లో చంద్రయ్య మృతదేహం కోసం బావిలో గాలిస్తు న్నారు.ఈ విషయాన్ని మణుగూరు పోలీసులకు సమాచారం చేరవేయడంతో, ఘటన ప్రాంతానికి మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ సందర్శించి ఆత్మహత్య గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

చంద్రయ్య, సరోజనమ్మ వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు మీరు పగిడేరురులోని, గొల్ల కొత్తూరు గ్రామంలో నివసిస్తుండగా, వృద్ధ దంపతులు ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆత్మహత్య గల కారణాలు తెలియ రాలేదు. వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్నారన్న విషయం పగిడేరులో కలకలం రేపింది. వీరు గ్రామంలో అందరితో మంచి సత్స, సంబంధాలు కలిగి ఉండేవారు. ఆత్మహత్యకు పాల్పడ్డ తల్లిదండ్రుల విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, ఘటన ప్రాంతానికి చేరుకొని కన్నీరు,మున్నీరు అవుతున్నారు.

# డాక్టర్ నిర్లక్ష్యంతో బాలుడి మృతి..



వరంగల్, జులై 29 :డాక్టర్ నిర్లక్ష్యంతో భూక్యా జీవన్ (13) మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే హన్మకొండ బాల సముద్రంలోని చక్రవర్తి హాస్పిటల్ లో జ్వరంతో బాలుడు చేరాడు. అయితే బాలుడికి ప్లేట్ లెట్స్ 1,90,000 ఉన్న కూడా.. డబ్బులు లాగాలనే.. కావాలనే తమ కుమారుడికి ఇంజక్షన్ ఇచ్చి డాక్టర్ నిర్లక్ష్యంతో ప్రాణాలు తీశారని తల్లి తండ్రులు, బంధువులు ఆరోపిస్తున్నారు.

బాలుడి మృతితో మాణిక్యం తండా ఎల్లయ్య గూడెం, చెన్నారావుపేట మండలంలో విషాదం చోటు చేసుకుంది. మృతుడి బంధువులు హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు.

# ఎన్ టీ పి సి పవర్ తెలంగాణకు అక్కర్లేదు..

న్యూఢిల్లీ, జులై 29 :తెలంగాణలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా.. రాష్ట్రప్రజలకు వీలైనంత ఎక్కువ విద్యుత్‌ను అందుబాటులో ఉంచాలనుకున్న కేంద్ర ప్రయత్నాలకు.. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా.. ఉత్పత్తి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా.. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా రామగుండంలో సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటుచేసి 4వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే ప్రాజెక్టునకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఆమోదముద్ర వేసిన సంగతి తెలిసిందే.

ఇందులో భాగంగా.. మొదటి విడతగా 800 మెగావాట్ల సామర్థ్యం గల 2 పవర్ ప్లాంట్లను ఎన్ టీ పి సి ఆధ్వర్యంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.10,598.98 కోట్లతో చేపట్టిన ఈ రెండు పవర్ ప్రాజెక్టుల్లో.. మొదటి 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 3 అక్టోబర్ 2023నాడు, రెండో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను 4 మార్చ్ 2024నాడు ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. ఈ 1600 మెగావాట్ల ప్రాజెక్ట్ లో 85% విద్యుత్ ను తెలంగాణ అవసరాలకే వినియోగిస న్నారు. ఈ 4వేల మెగావాట్ల ప్రాజెక్టులో మిగిలిన 2400 మెగావాట్ల ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా ప్రారంభించుకుని.. రాష్ట్రంలో విద్యుత్ భద్రత కల్పించాలని కేంద్రం భావిస్తోంది.

ఇందుకు గానూ ఎన్ టీ పి సి. తో.. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ ట్రాన్స్కో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. దీని తర్వాతే ప్లాంట్ల ఏర్పాటుకు, తగినంత బొగ్గు అందుబాటులో ఉంచుకోవడం మొదలైన అంశాలపై ఎన్ టీ పి సిపని ప్రారంభిస్తుంది.

ఒకవైపు, దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. స్టేజ్-ఎఎ ప్రాజెక్టును కూడా వీలైనంత త్వరగా పూర్తిచేసి విద్యుదుత్పత్తి పెంచాలనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. దీనికి అనుగుణంగానే.. పి పి ఎ విషయంలో త్వరగా స్పందించి సహకరించాలని.. రాష్ట్ర ప్రభుత్వానికి 4సార్లు లేఖలు రాసినా స్పందన రాలేదు.

5 అక్టోబర్, 2023 నాడు, 9 జనవరి, 2024 నాడు, 29 జనవరి, 2024 నాడు.. ఆ తర్వాత మొన్న 29 ఏప్రిల్, 2024 నాడు లేఖలు రాస్తే.. వీటికి ట్రాన్స్కో నుంచి సమాధానం లభించలేదు. ఇన్నిసార్లు లేఖలు రాసినా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో.. దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి రామగుండంలో కేంద్రం నిర్మించనున్న ప్రాజెక్టునుంచి విద్యుత్ కొనుగోలు చేసే ఆసక్తి లేదన్నట్లుగానే భావించాల్సి వస్తుందని లేఖలో పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వానికి ఆసక్తి లేని పక్షంలో.. దీన్ని దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలకు విక్రయించేందుకు అనుమతి ఉంటుందన్నది రాసిన లేఖల సారాంశం.30 మే 2024 నాడు దేశవ్యాప్తంగా 250 గిగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. మార్చి 2024లో తెలంగాణలో గరిష్ఠంగా (పీక్ పవర్ డిమాండ్) 15.6 గిగావాట్ల డిమాండ్ ఎదురైంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ( అంచనాల ప్రకారం.. 2030 నాటికి తెలంగాణలో పీక్ పవర్ డిమాండ్ ఇప్పుడున్న దానికి రెట్టింపు కానుంది.దీన్ని దృష్టిలో ఉంచుకుని.. పెరుగుతున్న పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ ను అందించేందుకు.. రెండోదశ పవర్ ప్లాంట్ (2400 మెగావాట్లు)ను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావడం అత్యంత అవసరముంది.తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ పై తొలి హక్కు తెలంగాణ ప్రజలదే. కేంద్రం అన్నిరకాలుగా సహకరిస్తున్నా.. దీన్ని అందుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమవుతోందనేది మరోసారి నిరూపితమైంది.

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం.. ఎన్ టీ పి సి రాస్తున్న లేఖలపై స్పందించి.. పి పి ఎ చేసుకుంటే అంది రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడినట్లు అవుతుంది. దీన్ని వెంటనే తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని సానుకూల చర్యలు చేపట్టాల్సిన అవసరముంది అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

# ఇందూరులో అంగరంగ వైభవంగా ఊర పండగ



నిజామాబాద్, జులై 29 ::ఇందూరులో ఊర పండుగను నగర ప్రజలు సంబురంగా జరుపుకున్నారు. ఆరాధ్య దేవతలైన గ్రామ దేవతను కొలుస్తూ ఈ ఊరపండును జరపడంలో నిజాంబాద్ నగర ప్రజలు ప్రత్యేకత చాటుకున్నారు. పాడి పంటలు ఆయురారోగ్యాలతో అందరూ సుఖ శాంతులతో చల్లంగా ఉండేలా దీవించు తల్లి అంటూ అమ్మవారిని ఇందూరు ప్రజలు వేడుకున్నారు..

ఆదివారం నిజామాబాద్ నగరంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఊర పండుగ ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా నగర ప్రజలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండుగ విశేష పదార్థంగా సరిని నగరంలో చల్లుతూ పంటలపై పశుసంపదలపై చెరువులో కలిపారు.ఊర పండుగ నిర్వహణ కమిటీ సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఖిల్లా రఘునాథ ఆలయం వద్ద ఉన్న శారదాంబ గద్దె( తేలు మైసమ్మ గద్దె) వద్ద గ్రామదేవతలను పసుపు కుంకు మ, చెవి పోగుల ఆభరణాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

### ఖిల్లా చౌరస్తా నుంచి దేవతామూర్తుల ఊరేగింపు

దేవతామూర్తులను ఊరేగింపుగా ఖిల్లా చౌరస్తా నుంచి గాజులపేట చౌరస్తా మీదుగా పెద్ద బజారు చౌరస్తా వరకు వచ్చిఅక్కడనుండి రెండు బృందాలుగా విడిపోయి డబ్బులు?పోతరాజుల విన్యా సాలతో మహిళల పూనకాలతో ఒక బృం దం పొడలమ్మ.. నల్ల పోచమ్మ, అడెల్లి పోచమ్మ, పెద్దమ్మ ,పులి రాట్నం , రెండో బృందం సిర్నాపల్లి గడి గోల్ హనుమాన్ చౌరస్తా మీదుగా వినాయక్ నగర్ ఐదు చేతుల పోచమ్మ మత్తడి పోచమ్మ మహాలక్ష్మమ్మలతో అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. సరిని నాలుగు గ్రూపులుగా విభజించి దుబ్బ వినాయక ఎల్లమ్మ గుట్ట కంటేశ్వర్ ప్రాంతాలకు చల్లుకుంటూ వెళ్లారు..

### తొట్టెల కింద నుంచి వెళ్లేందుకు పోటీ పడ్డ జనం

ఆరాధ్య దేవతలైన గ్రామ దేవతను కొలుస్తూ ఈ ఊరపండును జరపడంలో నిజామాబాద్ నగర ప్రజలు ప్రత్యేకత చాటుకున్నారు. అమ్మవారి ప్రతిరూపంగా తొట్టెలను ఊరేగిస్తారు.. ఈ తొట్టెల కింద నుంచి జనం వెళ్లేందుకు జనం పోటీప డ్డారు. చిన్న పెద్ద తేడా లేకుండా తొట్టెల కింద కూర్చొని నుంచి ఆయురారోగ్యాలను ప్రసాదించు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు.

### ప్రజలను సల్లంగా చూడమ్మా తల్లి? ఎమ్మెల్యే ధన్పాల్

ఇందూరు ప్రజలు చల్లంగా ఉండేలా దీవించు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ తెలిపారు. ఊర పండుగలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇందూరులో ఊరపండుగను ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం పాడి పంటలతో, ఆయు రారోగ్యాలను ప్రసాదించాలని అమ్మ వారిని వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ ఇల్లందుల ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, ప్రముఖులు పాల్గొన్నారు.

ఊర పండుగ సందర్భంగా రాజకీయ నాయకులు అమ్మవారి దర్శనం చేసుకు న్నారు. దర్శనం కోసం వచ్చిన వారికి నిర్వాహకులు స్వాగతం పలికి సత్క రించారు. ఊర పండుగలో పాల్గొన్న నాయకులకు సర్వసమాజ్ కమిటీ ఊరపండువ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

# అక్బరుద్దీన్‌ను చిత్తుగా ఓడిస్తాం - బండి సంజయ్

**-కేంద్ర మంత్రి బండి సంజయ్**
**-కొడంగల్లో పోటీ చేయించాలని సీఎంకి సవాల్**
**-భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేకపూజలు**

హైదరాబాద్, జులై 29: పాతబస్తీలో బోనాలు పండగ సందర్భంగా భాగ్యలక్ష్మీ అమ్మవారిని కేంద్ర మంత్రి బండి సంజయ్ దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కొడంగల్‌లో అక్బరుద్దీన్



పోటీ చేస్తే చిత్తు చిత్తుగా ఓడిస్తామని అన్నారు. సీఎం రేవంత్‌కు దమ్ముంటే అక్బర్‌ను కాంగ్రెస్ టికెట్‌పై కొడంగల్‌లో పోటీచేయించాలని సవాల్ చేశారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కామెంట్స్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ కౌంటరిచ్చారు. అక్బర్ కాంగ్రెస్‌లో చేరితే కొడంగల్ నుంచి గెలిపిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, ఆయనకు సమాధానంగా పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఇంటికి ఒక కార్యకర్తను ఇంచార్జ్‌గా నియమిస్తామని, కొడంగల్‌లో అక్బరుద్దీన్‌కు డిపాజిట్ రాకుండా చూసే బాధ్యత తమదని అన్నారు.

# వాయు కాలుష్యాన్ని నియంత్రించడానికి వినూత్న పద్ధతులు

న్యూఢిల్లీ, జులై 29 :వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి గానూ ట్రాఫిక్ జంక్షన్ల కాలుష్య నియంత్రణ కోసం ఎన్ఈఈఆర్ఐ(నీరి) అభివృద్ధి చేసిన వాయు శుద్ధీకరణ యూనిట్లు, నిర్మాణ ప్రదేశాలు, రోడ్డుపై ధూళిని నియంత్రించేందుకు ఈపీఆర్ఐ తయారు చేసిన డస్ట్ సప్రెస్సంట్, మానవ్ రచన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ స్టడీస్(ఎంఆర్ఐఐఆర్ఎస్) అభివృద్ధి చేసిన బస్సు పైకప్పుపై అమర్చే శుద్ధీకరణ వ్యవస్థ, ఐఐటీ బాంబే, టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కలిసి అభివృద్ధి చేసిన మధ్య తరహా వాయు శుద్ధీకరణ యూనిట్(స్మాగ్ టవర్), పుణెలోని ఎస్ అండ్ టీపీ అభివృద్ధి చేసిన అయోనీకరణ సాంకేతికతల పరీక్షలు జరిగాయి. ఈ అన్ని సాంకేతికతల్లో డస్ట్ సప్రెస్సంట్ ఫలితాలు చాలా ప్రోత్సాహకరంగా ఉన్నట్టు తేలింది. దీనిని ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వినియోగించాలని ఆదేశాలు ఇవ్వడమైంది.

ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టు సారాంశం, మంజూరైన వ్యయం, వెచ్చించిన ఖర్చు వివరాలు అనుబంధం-1లో ఉన్నాయి.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) జాతీయ పరిసరాల వాయు నాణ్యతా ప్రమాణాల(ఎన్ఏఏక్యూఎస్)ను 2009లో ప్రకటించింది. అన్ని నిర్ధారిత కాలుష్యకారకాలను కొలిచే విధానాన్ని ఎన్ఏఏక్యూఎస్‌లో పొందిపరిచింది. దేశంలో పరిసరాల వాయు నాణ్యత పర్యవేక్షణ ఈ పద్ధతి ప్రకారమే జరుగుతోంది. సవరించిన జాతీయ పరిసరాల వాయు నాణ్యత ప్రమాణాలు అనుబంధం-2లో ఉన్నాయి.

# బొగ్గు దిగుమతులు తగ్గిస్తూ ఎగుమతుల పెంపు

న్యూఢిల్లీ, జులై 29 :బొగ్గు దిగుమతులను తగ్గించడంతో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవడం ద్వారా దేశ విద్యుత్తు రంగంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ గణనీయ మార్పును తీసుకువస్తోంది. దేశీయంగా బొగ్గు ఉత్పత్తిని పెంచడం, విద్యుత్తు భద్రతను పటిష్ఠం చేయడం, బొగ్గు రంగంలో వృద్ధికి సహకరించడమే లక్ష్యంగా ఈ వ్యూహాత్మక అడుగు వేసింది.

2023-24 సంవత్సరంలో భారతదేశ బొగ్గు ఉత్పత్తిలో 11.65 శాతం విశేషమైన పెరుగుదల నమోదైంది. స్వయం సమృద్ధి సాధించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ఇది చాటుతోంది. 2024-25 సంవత్సరంలో 1,080 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడం ద్వారా ప్రధాన బొగ్గు ఉత్పత్తిదారుగా భారత్ స్థానాన్ని పదిలం చేసుకోవాలనేది లక్ష్యం.

బొగ్గు ఉత్పత్తులను తగ్గించడానికి గానూ అంతర్-మంత్రిత్వ శాఖ కమిటీని ఏర్పాటు చేయడమైంది. ఈ కమిటీ సంప్రదింపులు జరపడంతో పాటు వేర్వేరు మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకొని బొగ్గు దిగుమతి ప్రత్యామ్నాయానికి ఉన్న అవకాశాలను గుర్తిస్తుంది. కొంతవరకు హైగ్రేడ్ బొగ్గు దిగుమతుల అవసరాన్ని గుర్తిస్తూనే, తప్పనిసరి కానీ దిగుమతులను తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తైన బొగ్గు వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రధాన దృష్టి ఉంటుంది.

దిగుమతులను తగ్గించడంతో పాటు శిలాజ ఇంధనాలకు ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేందుకు ప్రభుత్వం బొగ్గు ఎగుమతులను చురుగ్గా ప్రోత్సహిస్తోంది. అంతర్జాతీయ బొగ్గు విపణిలో భారత్‌ను కీలకస్థానంలో నిలపడంతో పాటు ఈ రంగంలో ఆదాయాన్ని పెంచుకోవడం, ఉపాధి అవకాశాలను సృష్టించడమే దీని లక్ష్యం.

భారతదేశ విద్యుత్తు భద్రతను పటిష్ఠం చేసుకునేందుకు బొగ్గు దిగుమతులను తగ్గించడం, ఎగుమతులను పెంచడం అనేవి కీలక అడుగులు. దేశీయంగా ఉత్పత్తైన బొగ్గుపై ఎక్కువగా ఆధారపడటం ద్వారా విదేశీ సరఫరాలపై దేశం ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. అంతర్జాతీయ ధరల హెచ్చుతగ్గుల ప్రభావం నుంచి దూరంగా ఉండవచ్చు.

బొగ్గు రంగంలో ఈ పరివర్తన దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపించే అవకాశం ఉంది. బొగ్గు ఉత్పత్తిని, ఎగుమతులను పెంచడం ఆర్థిక వృద్ధికి, ఉద్యోగాల కల్పనకు, ప్రభుత్వ ఆదాయం పెరిగేందుకు దోహదపడుతుంది. పైగా, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం విదేశీ మారక నిల్వలను కాపాడుకునేందుకు ఉపయోగపడుతుంది.

ఎన్‌టీపీసీ, బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు(బీపీడీబీ) 50:50 వాటా కలిగిన ఉమ్మడి సంస్థ అయిన బంగ్లాదేశ్ ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ లిమిటెడ్(బీఐఎఫ్‌పీసీఎల్) నిర్మిస్తున్న మైత్రీ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఎంఎస్‌టీపీపీ)(2x660 ఎంవీ)కి అంతర్జాతీయ ధరల విధానం ప్రకారం ఏటా 5 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం.

బొగ్గు దిగుమతులు తగ్గించి, ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ తీసుకుంటున్న చొరవ దేశ విద్యుత్తు పరివర్తనలో కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ ఉత్పత్తిని పెంచడం, దిగుమతులకు ప్రత్యామ్నాయాన్ని అందించడం, ఎగుమతులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలని, విద్యుత్తు భద్రతను పటిష్టం చేసుకోవాలని, బొగ్గు రంగంలో వృద్ధికి సహకరించాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయత్నాలు భారత ఆర్థిక వ్యవస్థకు, అంతర్జాతీయ విద్యుత్తు రంగంలో దేశ స్థానానికి సుదూర ప్రయోజనాలు అందించే అవకాశం ఉంది.

# లండన్ లోని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో 'ఫెలో' గా సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. శ్రీధర్

హైదరాబాద్, జులై 29:: హైదరాబాద్ లోని సిఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ లో ముఖ్య శాస్త్రవేత్త, కెమికల్ ఇంజినీర్ డాక్టర్ సుందర్ గోపాల్ శ్రీధర్ కు యునైటెడ్ కింగ్ డమ్ (యుకె)లోని లండన్ లో గల ప్రతిష్ఠాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (ఎఫ్ఆర్ఎస్‌సి)లో మెంబర్ ఐడి: 771115 తో 'ఫెలో' గా ప్రవేశం లభించింది.

డాక్టర్ శ్రీధర్ 26 సంవత్సరాల పాటు పరిశోధక శాస్త్రవేత్తగా ఉంటూ రసాయనిక, సంబంధిత పరిశ్రమల కోసం అనేక సాంకేతికతలను అభివృద్ధి పరచడం, బదలాయించడంతో పాటు సామాజిక సంక్షేమానికి కూడా ఎంతగానో తోడ్పడ్డారు. ఔషధ నిర్మాణం, ఉక్కు, వస్త్రాలు, అరోమ కెమికల్స్, పెట్రోకెమికల్ పరిశ్రమలలో వెలువడే రసాయనాలకు సంబంధించిన ద్రవ వ్యర్థాల నుంచి గంటకు 500 లీటర్ ల మొదలు 5000 లీటర్ ల శుద్ధ పదార్థం రికవరీ సామర్థ్యం కలిగిన మరియు వాయు శుద్ధీకరణ కోసం ఎలెక్ట్రోడయేలిసిస్, నానోఫిల్ట్రేషన్, గ్యాస్ పర్మియేషన్ ప్రక్రియల పైన ఆధారపడ్డ మెంబ్రేన్ పైలట్ ప్లాంట్లను అనేకం రూపొందించి, అప్పగించడం ఆయన ఉద్యోగజీవనంలో ప్రధాన అంశాల్లో చెప్పుకోదగ్గవి.

భారతదేశంలో పది రాష్ట్రాలలో ఫ్లోరోసిస్, టైఫాయిడ్ వంటి నీటి ద్వారా సంక్రమించే వ్యాధుల బాధితులు 50 లక్షల మందికి సహాయకారిగా ఉండేందుకు గంటకు 600 లీటర్ల మొదలు 4000 లీటర్ల శుద్ధ జలం ఉత్పాదక శక్తి కలిగిన 75 కు పైగా నీటి శుద్ధి ప్లాంటులను డాక్టర్ శ్రీధర్ రూపొందించడంతో పాటు వాటి స్థాపనలోనూ ఆయన పాటుపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో దీర్ఘకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న 2 లక్షలకు పైచిలుకు రోగులకు రక్త శుద్ధికి ఉపయోగపడే మెడికల్-గ్రేడ్ అల్ట్రాప్యూర్ వాటర్ ను అందించే వినూత్నమైన, చౌకైన వ్యవస్థ ఆవిష్కరణ కూడా డాక్టర్ శ్రీధర్ ఘనతలలో ఒకటి. నీటి ఎద్దడి ప్రాంతాలలో, ఆసుపత్రులలో, రైల్వే స్టేషన్ లలో గాలిలో తేమను ఉపయోగించుకొని రోజుకు 60 లీటర్లు మొదలుకొని 1000 లీటర్ల వరకు రీమినరలైజ్డ్ తాగునీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగివుండే అట్మాస్ఫరిక్ వాటర్ జనరేటర్ కు ఆయన రూపకల్పన చేశారు.

కోవిడ్-19 ప్రభావాన్ని తగ్గించడానికి తక్కువ ఖర్చుతో తయారు చేయగలిగే కొత్తరకానివైన బహుళ పొరలు కలిగిన, ఉతకడానికి వీలుగా ఉండేటువంటి మాస్కులకు డాక్టర్ శ్రీధర్ రూపురేఖలను తీర్చిదిద్దారు. ఈ మాస్కులను బడిపిల్లలు సహా ఆరు లక్షలకు పైచిలుకు వ్యక్తులకు అందించారు. ఈ మాస్కులు ఎన్‌జిఒ లకు 2 కోట్ల రూపాయల ఆదాయాన్ని సంపాదించి పెట్టడంతో పాటు 500 మంది వయోవృద్ధులకు, స్వయంసహాయ సమూహాల (ఎస్ హెచ్ జిస్)కు చెందిన మహిళలకు ఉపాధిని కల్పించాయి.

డాక్టర్ శ్రీధర్ రాసిన 181 పరిశోధన పత్రాలను ప్రఖ్యాత అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించారు. ఆయన 2021,2022, 2023 సంవత్సరాలలో యుఎస్ఎ లోని స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ సైన్స్ పబ్లిషర్ లు రూపొందించిన అగ్రగామి 2 శాతం శాస్త్రవేత్తల లో ఒకరు గా స్థానాన్ని సంపాదించుకొన్నారు. ఆయన 15 పేటెంట్ లను సాధించారు, నాలుగు పుస్తకాలు వ్రాశారు; ఆయన రాసిన వ్యాసాలు 50 పుస్తకాలలో అధ్యాయాలుగా ప్రచురణకు నోచుకొన్నాయి.

డాక్టర్ శ్రీధర్ ప్రతిష్ఠాత్మకమైన డెబ్బయ్ విజ్ఞాన శాస్త్ర పురస్కారాలను అందుకొన్నారు. వాటిలో 2007 సంవత్సరం సిఎస్ఐఆర్ యువ శాస్త్రవేత్త పురస్కారం, 2011 సంవత్సరానికి స్కోపస్ యువ శాస్త్రవేత్త పురస్కారం, 2013 సంవత్సరానికి ఎన్ఎఎస్ఐ రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్లాటినమ్ జూబిలీ అవార్డు, 2015 సంవత్సరంలో ఐఐటీ-రూడ్ కీ నుంచి అవార్డు, 2016-2020 సంవత్సరాల మధ్య కాలంలో అయిదు సిఐపిఇటి జాతీయ పురస్కారాలు, 2017 లో ఐఐటీ-ఖరగ్ పుర్ నుంచి నీనా సక్సేనా సాంకేతిక విజ్ఞాన శ్రేష్ఠత్వ పురస్కారం, 2019-2021 సంవత్సరాల మధ్య కాలంలో మూడు హెచ్‌పిసిఎల్ ఎన్‌జిఐసి పురస్కారాలు, గత సంవత్సరంలో ఏడు ఐఐసిహెచ్ఇ పురస్కారాలతో పాటు అసోచామ్ పురస్కారం కూడా ఉన్నాయి.

# జనరల్ ఆసుపత్రిలో మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీలు..



ఖమ్మం, జులై 29:ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ని ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణ మొత్తం తిరిగి పరిష్కరించారు. మాతా శిశు కేంద్రనీ ఎదుట ఉన్న నిలువ మురుగును తక్షమే పరిశుభ్రం చేయాలనీ మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. వైద్యులు ప్రతిక్షణం బాధితులకు అందుబాటులో ఉండాలని వారి పట్ల అసహనం తో మాట్లాడొద్దని, రోగులతో స్నేహపూర్వకంగా ఉండి మెరుగని వైద్యం అందించాలని అన్నారు.

హాస్పటల్లో మందుల కొరత లేకుండా కలెక్టర్ ఆదేశాలు జరిగిన అలాగే వైద్యుల కొరత లేకుండా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారని వైద్యులకు తెలిపారు. అన్నారు. మెడికల్ డిప్యూటీ సూపరెంట్ బి కిరణ్ కుమార్ హాస్పిటల్లో 600పడకలకు శాంక్షన్ ఉంటే 450 పడకలే ఉన్నాయని పర్మిషన్ ఉన్నదని అడగగా,6వందల పడకల ఆసుపత్రి ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయి

**-సర్కార్‌పై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ధ్వజం**

హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయని, రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ ధ్వజమెత్తారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సమస్య గురించి నిన్న నేను, హరీష్ రావు మాట్లాడితే లా అండ్ ఆర్డర్ బాగుంది అని మంత్రి పేర్కొన్నారు. మళ్లీ నిన్న నగరంలో 3 హత్యలు చోటు చేసుకున్నాయి. టాన్క్ ఫోర్స్ పోలీసుల పని నేరస్థులను పట్టుకోవడం కానీ వాళు రాత్రి పూట సామాన్యుల మీద లాఠీఛార్జ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో పోలీసులు రాత్రిపూట డ్యూటీలు చేస్తూ పగటి పూట పడుకుంటున్నారు. దీంతో హత్యలు పగటిపూట జరుగుతున్నాయని అక్బరుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి సమయాల్లో ఆస్పత్రులకు వెళ్తున్న వారిపై పోలీసులు లాఠీలు ఝులిపిస్తున్నారు. ఐటీ ఉద్యోగుల మీద కూడా పోలీసులు విరుచుకుపడుతున్నారు. హైదరాబాద్‌లో ఫ్రెండ్లీ పోలిసింగ్ లేదు. కనిపించిన వారిని కనిపించినట్టే కొడుతున్నారు. క్రిమినల్స్‌ను మాత్రం పట్టుకోవడం లేదు. వారిని శిక్షించడం లేదు. గంజాయి, డ్రగ్స్ తరలిస్తున్న వారి పట్ల పోలీసులు నిర్లక్ష్యంగా ఉంటున్నారు. సామాన్యులపై మాత్రం జులుం ప్రదర్శిస్తున్నారని ఓవైసీ తెలిపారు. హైదరాబాద్‌లో అన్ని పోలీస్ స్టేషనులకు లంచాలు వెళుతున్నాయి. ఒక ఏసీపీ నాకు ఫోన్ చేసి మీ ఏరియాలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి డబ్బులు సాయం చేయమని అడిగితే, నేనెందుకు ఇవ్వాలి మీకు లంచాలు వస్తున్నాయి కదా దానితో కట్టండి అని చెప్పాను. ఈ లంచాలపై ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలి. విచ్చలవిడిగా గంజాయి సేవిస్తూ చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిని పట్టుకుని కఠినంగా శిక్షించండి. అసలు హైదరాబాద్‌లో ఎక్కడుంది లా అండ్ ఆర్డర్ అని అక్బరుద్దీన్ ఓవైసీ రేవంత్ సర్కార్‌ను నిలదీశారు. హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ సమస్య గురించి నిన్న నేను, హరీష్ రావు మాట్లాడితే లా అండ్ ఆర్డర్ బాగుంది అని మంత్రి అన్నారు.. మళ్లీ నిన్న నగరంలో 3 హత్యలు అయ్యాయి. టాస్క్ ఫోర్స్ పోలీసుల పని నేరస్థులను పట్టుకోవడం కానీ వాళ్లు రాత్రి పూట సామాన్యుల మీద లాఠీఛార్జ్ చేస్తున్నారు.

# హక్కుల సాధన కోసం ఆందోళనబాట పట్టిన పారిశుద్ధ్య కార్మికులు



యాదాద్రి భువనగిరి జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హక్కుల సాధన కోసం పారిశుద్ధ్య కార్మికులు ఆందోళనబాట పట్టారు. జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం, పెండింగ్‌లో ఉన్న 3 నెలల జీతం వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ సోమవారం పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. దీంతో భువనగిరి జిల్లా హాస్పిటల్‌లో పారిశుద్ధ్య సేవలు నిలిచిపోయాయి. జీవో నెంబర్ 60 ప్రకార వేతనాలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అందరికి వర్తింప చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులు విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2022 జూన్ నెల నుండి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం పెంచిన కొత్త వేతనాలను ఆసుపత్రి కార్మికులు అందుకుంటున్నారని కానీ భువన గిరి జిల్లా ఆసుపత్రిలో మాత్రం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేసి ఇవ్వని వారికి వెంటనే ఇవ్వాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేసి 3 షిఫ్ట్ లు వెంటనే అమలు చేయాలన్నారు. సంవత్సర కాలంగా తక్కువ ఇచ్చిన వేతనం వెంటనే చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్ని హెచ్చరించారు.

# అమాయకుడైన జగన్‌కు న్యాయం చేయండి..

**- జనసేన నేత నాగబాబు సెటైర్లు**

అమరావతి జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మాజీ సీఎం వైఎస్ జగన్‌పై జనసేన నేత నాగబాబు మరోసారి సెటైర్లు వేశారు. జగన్ మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎద్దేవా చేశారు. 2019కి ముందు అప్పటి ఎమ్మెల్యేగా ఉండి తదనంతరం అంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మారి ప్రస్తుతం పులివెందుల ఎమ్మెల్యేగా మిగిలినటువంటి జగన్ మోహన్ రెడ్డికి కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని వ్యంగ్యంగా అన్నారు. ఎందుకంటే 2019 లో శ్రీను అనే వ్యక్తి జగన్‌పై కోడికత్తితో దాడి చేశాడని.. ఐదేళ్లు అయిన కూడా ఆ కేస్ ఇంకా కొలిక్కి రాలేదని గుర్తు చేశారు. అప్పుడంటే జగన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ వల్ల ఆయనకు కుదర్లేదని



అన్నారు. ఇప్పుడు ఆయన ఖాళీగానే ఉన్నారు కాబట్టి కూటమి ప్రభుత్వం ఆయనకు న్యాయం చేయాల్సిన అవసరం అత్యవసరంగా ఉందని తెలిపారు. జగన్ మీద హత్యాయత్నం చేసిన నేరస్థుడికి సరైన శిక్ష విధించాలి కదా! కాబట్టి ఆయన కేసును తక్షణమే విచారించాలని నాగబాబు కోరారు. ఈ కేసును తక్షణమే విచారించి అమాయకుడు అయినటువంటి జగన్ మోహన్ రెడ్డికి న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరారు.

# శాఖాహారంతో శాంతికి మార్గం

**- శాకాహార ర్యాలీ లో బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి కోవూరి సత్యనారాయణ గౌడ్**




సంగారెడ్డి జిల్లా జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్); సంగారెడ్డి పట్టణంలో ఉమ్మడి మెదక్ జిల్లా పిరమిడ్ మాస్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా శాకాహార ర్యాలీ రాజీవ్ పార్క్ న్యూ బస్టాండ్ నుండి మొదలై విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ప్రముఖ ప్రముఖ మేధావుల గురువుల మరియు పిరమిడ్ ధ్యానులతో సమావేశమై శాఖాహారం యొక్క విశిష్టతను మేధావులు, వక్తలు,గురువులు మరియు పిరమిడ్ మాస్టర్లు తెలియజేశారు. తదనంతరం గురువులను మేధావులను వక్తలను శాలువాలతో ఘనంగా ఉమ్మడి మెదక్ పిరమిడ్ మాస్టర్లు సన్మానించారు. అందులో భాగంగా పత్రీజీ గారి ఆశయాలను దృష్టిలో ఉంచుకొని బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ గారు మహాత్ముల యొక్క బాటను అనుసరిస్తూ, గురువుల యొక్క బాటను అనుసరిస్తూ ఈ యొక్క భారతదేశంలో మానవ దేహం దేవాలయం లాంటిదని అట్టి దేవాలయం ఆత్మ పరమాత్మతో కూడినదని అట్టి జ్ఞానాన్ని మానవుడు తెలుసుకున్న నాడే నిజమైన జీవన విధాన మార్గాన్ని అనుసరిస్తున్నాడని, తద్ మార్గం ధ్యానమార్గం ద్వారానే సాధ్యమని తెలియజేస్తూ మనిషి పుట్టుకతోనే జీవన విధానం శాకాహార జీవన విధానం అని గొప్ప గొప్ప మేధావులు, గురువులు, మరియు పిరమిడ్ మాస్టర్లు తెలియపరిచిన మాటలను పునరావృతం చేస్తూ శాఖాహార సభలో ఉన్నటువంటి ధ్యానులకు తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, పీఠాధిపతులు వట్టిపల్లి గురువు శివమణి గారు, శ్రీవిద్య ఉపాసకుడు సంజీవ్ మహారాజ్ గారు, బ్రహ్మకుమారిస్ అక్కయ్య సుమంగళ సుకన్య, ఇతర పీఠాధిపతుల తో పాటు బ్రాహ్మణ రత్న మారం శివప్రసాద్ మాస్టర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఆనంద్ ప్రసాద్ కుమార్ గారు, మహేశ్వర పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు దామోదర్ రెడ్డి గారు, సభ నిర్వాహక అధ్యక్షులు సంగమేశ్వర్ గారు, శ్రీనివాస్ గారు, మెదక్ పిరమిడ్ పార్టీ కాంటెస్టెడ్ ఎంపీ సాయి గౌడ్, బోధన్ సాయిలు మాస్టర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పులి సంఘప్ప గౌడ్, పరమశివ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఇంచార్జ్ కరాటే మాస్టర్ అశోక్, సంగారెడ్డి జిల్లా ఆర్గనైజర్ దత్తు మాస్టర్, నారాయణఖేడ్ ధ్యాన కేంద్ర ఇంచార్జ్ విఠలాచారి, పిరమిడ్ సేవాదళ్ కన్వీనర్ సుజాత గంగారెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు భూపతి రాజుగారు, సినీ ఫైటర్ మౌన స్వామి సిద్దిపేట నరసింహులు గౌడ్, సైదులు మాస్టర్, పిరమిడ్ మాస్టర్లు రాఘవరెడ్డి, కృష్ణ మాస్టర్ మరియు అధిక సంఖ్యలో పిరమిడ్ ధ్యానులు పాల్గొన్నారు.

# పాలకపక్షం ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా.. రేవంత్ రెడ్డి సభను పక్కదారి పట్టిస్తున్నారు

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ పోరెస్స్ న్యూ స్); : పాలకపక్షం ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా.. సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు, సత్య దూరమైన అంశాలను లేవనెత్తుతూ సభను పక్కదారి పట్టిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. సభా నాయకుడు ఇతర సభ్యులకు ఆదర్శంగా ఉండాల్సింది పోయి సభలో అబద్దాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ ప్రాంగణంలో హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. గత సమావేశాల్లో మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం ప్రాజెక్టు సాధ్యం కాదని రిటైర్డ్ ఇంజినీర్లు నివేదిక ఇచ్చినా కేసీఆర్ పట్టించుకోలేదని అబద్ధమాడారు. రిటైర్డ్ ఇంజినీర్ల వాదన వేరే లాగా ఉంటే సీఎం మరోలా చెప్పి సభను తప్పుదోవ పట్టించారు. నిన్నటి సమావేశంలో విద్యుత్ మీటర్లపై కూడా తప్పుడు పత్రంతో సీఎం సభను తప్పుదోవ పట్టించారు. తనకు కావాల్సిన వాక్యం చదివి మిగతా పదాలు వదిలేశారు. ఈ అంశంపై మేము ఇప్పటికే వాయిదా తీర్మానం ఇచ్చాము. సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం కూడా ఇస్తాం. నేను వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కేసీఆర్ ఒప్పుకోలేదు అంటే ఆ సందర్భంలో ఉదయ్ స్కీం ఒప్పందం చదివి వ్యవసాయ మీటర్లకు ఒప్పుకున్నట్టు భ్రమింపజేశారు అని హరీశ్‌రావు తెలిపారు. పోతిరెడ్డిపాడుపై వైఎస్ హయాంలో మేము పదవుల కోసం పెదవులు మూసుకున్నాం అని రేవంత్ మాపై ఆరోపణలు చేశారు. పోతిరెడ్డి పాడుపై జీవో రాకముందే మేము వైఎస్ కేబినెట్ నుంచి వైదొ లిగాము. మేము రాజీనామా చేయ డానికి పోతిరెడ్డి పాడు సహా అనేక అంశాలు కారణం. పదవుల కోసం పెదవులు మూసుకున్నది రేవంత్ రెడ్డి. తానేదో తెలంగాణ ఛాంపియన్ అయినట్టు రేవంత్ మాట్లాడుతుంటే అందరూ నవ్వుకుంటున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ గురించి రేవంత్ అప్పుడు ఏం మాట్లాడారు.. ఇప్పుడేం చేస్తున్నారు..? కోమటిరెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎల్ఆర్ఎస్ ఫీజులు లేకుండా చేయాలని ఆనాడు డిమాండ్ చేశారు.. ఇప్పుడేం చేస్తున్నారు.. అన్నీ ద్వంద్వ ప్రమాణాలే. రేవంత్ ఇప్పటికే మూడు సార్లు అబద్దపు అంశాలతో సభను తప్పుదోవ పట్టించారు. మీడియా కూడా రేవంత్ అబద్దాలను ఎండగట్టాలి. రుణమాఫీపై రేవంత్‌ది గోబెల్స్ ప్రచారం.

# తెలంగాణ నుంచి తరలిస్తున్న అక్రమ మద్యం సీజ్.. వ్యక్తి అరెస్ట్



హైదరాబాద్, జులై 29: తెలంగాణ నుండి మోటార్ సైకిల్‌పై అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను శ్రీశైలం పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ నుంచి మద్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు శ్రీశైలం వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ రావు, సిబ్బంది రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, శంకర్, అమర్నాథ్ రెడ్డి తదితరులు శ్రీశైలం దేవస్థానం టోల్ గేటు వద్ద తనిఖీ చేశారు. ఆ తనిఖీల్లో ఒక వ్యక్తి అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న సంగతి పోలీసులు గుర్తించారు.

ఆయన్ను అదుపులోకి తీసుకోవడంతోపాటు అతనివద్ద నుంచి 70 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌పై జైలుకు పంపారు. పట్టుబడిన ముద్దాయి ఆకుల వంశీ అలియాస్ సన్నీ (19) నంద్యాల జిల్లా శ్రీశైలం మండల కేంద్రంలోని కొత్తపేట వాసి అని తేలింది. తెలంగాణ నుంచి తీసుకొస్తున్న 70డీకే డబుల్ కిక్ సుపీరియర్ విస్కీ బాటిళు ్లు, డామినార్ మోటారు సైకిల్‌ను పోలీసులు జప్తు చేశారు.

# రాచకొండ కమిషనరేట్‌లో సైకిల్ పెట్రోలింగ్ ప్రారంభం : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్, జులై 29: ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ కొత్తగా సైకిల్ పెట్రోలింగ్‌ను (అఎఇశ్రీవ జూజీబితీనీశ్రీ) ప్రారంభించామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు(అఖ౹ాబీటప్తతితీ ఃజీఎబీ) తెలిపారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్‌తో పాటు కొత్తగా సైకిల్ పెట్రోలింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ఒకో పోలీస్‌స్టేషన్‌కు 3 నుంచి 5 సైకిళ్లను పంపిణీ చేయడంతో సోమవారం నుంచి సిబ్బంది సైకిల్ పెట్రోలింగ్ మొదలు పెట్టారని వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానిక ఠాణా సిబ్బంది ఆయా ప్రాంతాలలో సైకిళ్ల ద్వారా పెట్రోలింగ్ చేస్తూ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసుల సేవలను మరింత చేరువ చేయడంలో భాగంగా పెట్రోలింగ్‌ను ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు.

క్షేత్ర స్థాయి విధి నిర్వాహణలో మహిళా సిబ్బంది పాత్రను పెంచుతూ వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నామని తెలిపారు. దాంతో ఉత్సాహంగా బ్లూకోల్ట్స్, పెట్రో కార్, సైకిల్ పెట్రోలింగ్ విధులలో వారు భాగస్వాముల వుతున్నారని సీపీ అభినందించారు. మహిళలకు రక్షణగా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, చిన్నారులు, వృద్దులపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ 100, 112కు ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగగా స్పందిస్తున్నామన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలి : మాజీ మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్, జులై 29: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు.

తాను కాంగ్రెస్‌లోకి వెళుతున్నట్లు ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పాలనలో రైతు భరోసాకు దిక్కులేదని, అందరికీ రుణమాఫీ జరగలేదన్నారు. ఆసరా పింఛన్లను పెంచడంలో విఫలమైందన్నారు. సీఎంతో సహా మంత్రులు స్కాంలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుర్తి నియోజక వర్గంలో బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని ఎర్రబెల్లి సూచించారు.

# డిజిటల్ రంగంలో 'విశ్వాస్ పే' యాప్ ప్రారంభం

## - విశ్వాస్ వరల్డ్ మార్ట్ ఈ కామర్స్ కూడా...



హైదరాబాద్, జులై 29: విశ్వాస్ వరల్డ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 'విశ్వాస్ పే' యాప్, 'విశ్వాస్ వరల్డ్ మార్ట్' ఈ కామర్స్ అనే రెండు వినూత్న ప్లాట్‌ఫారమ్‌లను ప్రారంభించింది. ఈ సందర్భంగా విశ్వాస్ వరల్డ్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వాస్ ఎన్ మాట్లాడుతూ డిజిటల్ రంగంలో విప్లవాత్మక మార్పులే లక్ష్యమన్నారు. అనేక సౌకర్యాలు, తగ్గింపులు అందించడమే ధ్యేయంగా విశ్వాస్ పే యాప్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఆన్‌లైన్‌లో విస్తృతంగా ఉత్పత్తులను కనుగొనగలిగే ఈ కామర్స్ వేదిక విశ్వాస్ వరల్డ్ మార్ట్‌ను కూడా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వినియోగదారుల అవసరాలను తీర్చే వినూత్న పరిష్కారాలతో ఈ రెండూ లాంచ్ చేశామన్నారు. మరింతగా కనెక్ట్ చేయబడిన ప్రపంచం వైపు మా ప్రయాణం ప్రారంభం మాత్రమేనన్నారు. ఈ ఈవెంట్ బెంగుళూరులోని షెరటాన్ గ్రాండ్లో వినయ్ గురూజీ, సినీ నటులు ప్రేమ్, రంజనీ రాఘవన్, కోమల్ కుమార్ సమక్షంలో నిర్వహించామని పేర్కొన్నారు.

# సచివాలయ, హెచ్‌వోడీ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను పెంపు

## -ఏపీ ప్రభుత్వం నిర్ణయం

అమరావతి జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు నాయుడు తీపికబురు అందించారు. సచివాలయ, హెచ్‌వోడీ ఉద్యోగులకు హెచ్ఆర్ఏను పెంచుతూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 16 శాతం హెచ్ఆర్ఏను 24 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తం రూ. 25వేలకు మించకుండా వర్తింపజేయాలని ఆర్థిక శాఖ కార్యదర్శి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 12వ పీఆర్సీ సిఫారసులు ఇంకా రానందున.. 2025 జూన్ వరకు ఈ హెచ్ఆర్ఏ అమలు చేయనున్నట్లు చెప్పారు.

# గత పాలకుడి తప్పులను సరిదిద్దుతున్నాం..!

## జగన్‌పై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..!

అమరావతి, జులై 29: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష జరిపారు. త్వరలో ప్రజలకు అందించబోయే రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలపై సమీక్షించారు. సమావేశంపై చంద్రబాబు ఆసక్తికర ట్వీట్ చేశారు. పట్టాదార్ పాస్ బుక్‌లపై తన బొమ్మ వేసుకొని తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిన గత పాలకుడి తప్పులను సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు. తాత, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులపై ఎవరి బొమ్మ ఉండకూడదన్నది ప్రజల అభిప్రాయమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాజముద్రతో కూడిన కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని సీఎం ప్రకటించారు.

అహంకార పూరిత, పెత్తందారీ పోకడలు ప్రజాప్రభుత్వంలో ఉండవన్నారు. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడి, వారి ఆస్తులకు రక్షణ కల్పించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. చంద్రబాబు చేసిన సమీక్ష వివరాలను.. మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాకు వివరించారు.

పాస్ పుస్తకాల్లో వైఎస్ జగన్ ఫొటోను ఎందుకు వేశారో అర్థం కాలేదని.. ఇకపై రాజముద్రతో పాస్ పుస్తకాలను రాజముద్రతో ఇవ్వనున్నట్లు తెలిపారు. గుజరాత్‌లో ఉన్న ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ మీద అధ్యయనం చేసి.. ప్రజలకు మేలు చేసేలా ఏపీలో ఆ చట్టాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు.

పట్టాదారు పాసుపుస్తకాలపై తన బొమ్మ వేసుకుని తీవ్ర అధికార దుర్వినియోగానికి పాల్పడిన గత పాలకుడి తప్పులను సరిదిద్దుతున్నాం.



తాత, తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులపై ఎవరి బొమ్మా ఉండకూడదు అనేది ప్రజా అభిప్రాయం.

# మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో కీలక పరిణామం..

## -ముగ్గురిపై సస్పెన్షన్ వేటు

అమరావతి జూలై 29 (ఏక ప్రెస్స్ న్యూ స్);ఏపీలోని అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మాజీ ఆర్డీవో మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి సమయంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగి పలు ఫైల్స్ దగ్ధం కావడం సంచలనంగా మారింది. ఇది అగ్ని ప్రమాదం కాదని.. కావాలని చేసినట్లు ఉందని డీజీపీ ద్వారకా తిరుమల రావు ఆ సమయంలో అనుమానం వ్యక్తం చేశారు. ఆ కోణంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అనుచరులను విచారిస్తున్నారు. ఈ క్రమంలోనే నిన్న హైదరాబాద్ మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో నివాసం ఉంటున్న పెద్దిరెడ్డి వ్యక్తిగత సహాయకుడైన శశిధర్‌ను ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 8 గంటల పాటు సోదాలు చేసి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని 4 బాక్సుల్లో భద్రంగా ఏపీకి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే ఏపీ ప్రభుత్వం ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవడం విశేషం.

# ఆటో డ్రైవర్‌తో వాగ్వాదం.. గుండెపోటుతో రాజకీయ నేత కుమారుడు మృతి

ముంబై, జులై 29 :: రాజకీయ నేత కుమారుడు ఒక ఆటో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో గుండెపోటు రావడంతో కుప్పకూలి మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కి చెందిన రఘునాథ్ మోరే కుమారుడైన 45 ఏళ్ల మిలింద్ మోరే ఆదివారం తన కుటుంబంతో కలిసి నవపూర్‌లోని రిసార్ట్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వెళ్లే క్రమంలో ఆటో డ్రైవర్‌తో వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా గుండెపోటు వల్ల చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు.

కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్ అయిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివసేన (యూబీటీ) థానే యూనిట్‌కు డిప్యూటీ చీఫ్‌గా మిలింద్ మోర్ ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

# గేమ్ ఛేంజింగ్ బడ్జెట్ కాదు..నేమ్ ఛేంజింగ్ బడ్జెట్

హైదరాబాద్, జులై 29: తాము గేమ్ ఛేంజింగ్ బడ్జెట్ ప్రవేశపెడతామని రాష్ట్ర బీజేపీ నేతలు గొప్పలు చెప్పారని ఒడిషా మాజీ సీఎం, అసెంబ్లీలో విపక్ష నేత నవీన్ పట్నాయక్ ఎద్దేవా చేశారు. గేమ్ ఛేంజింగ్ బడ్జెట్‌కు బదులు వారు నేమ్ ఛేంజింగ్ బడ్జెట్ పెట్టారని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్ సోమవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.

వారు ప్రవేశపెట్టిన పథకాల్లో 87 శాతం స్కీమ్‌లు ఇప్పటికే బీజేడీ ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. తమ పథకాలను కాపీ కొడుతూ బీజేపీ ప్రభుత్వం నూతన పథకాలుగా చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. కాగా, సీఎం మోహన్ చరణ్ మాఝీ నేతృత్వంలోని ఒడిషా ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 2.65 లక్షల కోట్ల బడ్జెట్‌ను ఇటీవల ప్రవేశపెట్టింది.

వ్యవసాయం, మౌలిక వసతులు, సంక్షేమం ప్రాధాన్యతలుగా ఈ బడ్జెట్ రూపొందించామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆర్థిక శాఖను కూడా పర్యవేక్షిస్తున్న సీఎం మోహన్ మాఝీ ఒడిషా అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతూ నిర్వహణ వ్యయం కింద రూ. 97,725 కోట్లు, కార్యక్రమాల అమలుకు రూ. 1.55 లక్షల కోట్లు కేటాయింపులు చేపట్టామని తెలిపారు.

# బీజేపీ శాసనసభాపక్ష నేతగా విష్ణుకుమార్ రాజు ఎన్నిక

అమరావతి, జులై 29: ఆంధ్రప్రదేశ్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా పి. విష్ణుకుమార్ రాజు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం నార్త్‌నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. పార్టీ ఆదేశాల మేరకు విష్ణుకుమార్ రాజును ఎల్పీ లీడర్‌గా శనివారం ఎన్నుకున్నారు.

2014-19 మధ్య కూడా బీజేపీ ఎమ్మెల్యేగా చంద్రబాబు హయాంలో పనిచేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పురోగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

2019-24 మధ్య వైసీపీ పాలనలో రాష్ట్రం దిగజారిపోయేలా పాలన జరిగిందని ఆరోపించారు. తనను కూడా అనేక విధాలుగా ఇబ్బంది పెట్టారని తెలిపారు. బిల్లులు చెల్లించకుండా గుత్తేదారులను వేధించారని విమర్శించారు.

మొన్నటి ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేసి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో బీజేపీ 10 స్థానాల్లో పోటీ చేసి 8 చోట్ల విజయం సాధించారు.

అదే విధంగా టీడీపీ 144 స్థానాలకు గాను 134 స్థానాల్లో, జనసేన 21 స్థానాల్లో పోటీ చేసి 21 చోట్ల గెలుపొందింది.

# మల్లన్న సన్నిధిలో తెలంగాణ హైకోర్ట్ జస్టిస్.. ఏపీ డీజీపీ ప్రత్యేక పూజలు..!



అమరావతి, జులై 29:శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ వీ వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆర్కే మీనా దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున శ్రీకృష్ణరాయ గోపురం వద్దకు చేరుకున్న వారికి దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చక, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

అనంతరం జస్టిన్ ఈవీ వేణుగోపాల్, ఆర్కేమీనాలు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకాలు, కుంకుమార్చనలు చేసుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేయించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం, జ్ఞాపికను అందించారు.

ఈ కార్యక్రమంలో ఈఓ పెద్దిరాజుతోపాటు ఆలయ అధికారులు, శ్రీశైలం వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావులు పాల్గొన్నారు

# దళితుల సమస్యల పరిష్కారానికి కృషి : సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, జులై 29: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడతెలిపారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా సోమవారం ఆమెను కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి రూ, 10లక్షలను ఆర్థిక సాయం చేసినట్లు వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపు చూస్తుందని పేర్కొన్నారు. దళితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటూ ప్రభుత్వంపై సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లెల్ల కృష్ణారెడ్డి, ఊటు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడ రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ,జూలై 29 : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వేస్టేషం పరిధిలో జరిగింది.

ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45)ఆదివారం రాత్రి ఫలక్‌నామా-ఉందానగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన రైలు ఢీకొనడంతోఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.

సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై పసుపుపచ్చ రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు.

కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com